
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు
జిల్లా వార్తలు

5

శనివారం 24 మే 2025

శిథిలావస్థలో చెరువులు




హోళగుంద మండలం హెబ్బటంలో 400 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దవంక చెరువు తూము (స్లూయిస్) దుస్థితి.

చెరువులు.. పల్లెసీమల్లో సాగు, తాగునీటికి ఆధారం. పశువులకు దాహం తీర్చే జలపుంతలు. దశాబ్దాలుగా చెరువుల నిర్వహణ, మరమ్మతులపై ఏలికలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో చెరువుల గట్లు దెబ్బతింటున్నాయి. తూములు (స్లూయిస్), కాలువలు శిథిలావస్థకు చేరుతున్నాయి. పూడిక చేరి సామర్థ్యం తగ్గిపోతున్నాయి. ముళ్లకంపలతో నిండిపోతున్నాయి. పలు గ్రామాల్లో కబ్జాకు గురై ఆనవాళ్లు కోల్పోతున్నాయి. వర్షపు నీరు చేరే పరిస్థితి లేక.. చేరినా పొలాలకు మళ్లించే మార్గాలు కనిపించడం లేదు. సీజనల్లో రైతులకు సాగు కష్టాలు తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై)'లో భాగంగా దశాబ్దాలుగా గ్రామీణులకు జలాధారమైన చెరవుల మరమ్మతులు, నవీకరణ, పునరుద్ధరణ (ఆర్‌ఆర్‌ఆర్)కు శ్రీకారం చుట్టింది. వెనుకబడి జిల్లాల అభివృద్ధి కింద కేంద్రం 90 శాతం నిధులు ఇస్తుంది. కేవలం 21 చెరువులకే ప్రతిపాదనలు పంపారు. కరువు, వలసలకు నిలయమైన ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో ఒక్క చెరువు కూడా ఆ జాబితాలో లేదు. అక్కడ ఎంఐ ఇంజనీర్లు లేకపోవడమే ప్రధాన కారణం. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- పల్లెసీమలకు జలాధారం చెరువులే
- ట్రిపుల్ ఆర్ కింద మరమ్మతులకు కేంద్రం నిధులు
- వెంటాడుతున్న ఇంజనీర్ల కొరత
- 21 చెరువులకు మాత్రమే రూ.33.88 కోట్లతో ప్రతిపాదన
- ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాలపై ఎందుకీ నిర్లక్ష్యం
- ఎమ్మెల్యేలు స్పందించకుంటే రైతులకు కన్నీళ్లే

కర్నూలు, మే 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా చిన్నతరహా నీటిపారుదల శాఖ పరిధిలోని కర్నూలు, డోన్, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్లలో 100 ఎకరాల ఆయకట్టు పైబడిన చెరువులు 60, వంద ఎకరాలులోపు ఆయకట్టు కలిగిన చెరువులు 250 ఉన్నాయి. 310 చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం 4.411 టీఎంసీలు (4411 ఎంసీఎఫ్‌టీ). 33,113 ఎకరాల ఆయకట్టు ఉంది. అత్యధిక చెరువులు శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించినవే. మరమ్మతులు, పూడిక తీత చేపట్టకపోవడం వల్ల పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలతో నిండిపోయాయి. తూములు, పంట కాలువలు, అలుగులు పాడైపోతున్నాయి. గట్లు బలహీనంగా మారుతున్నాయి. వర్షాలు వచ్చిందంటే ఏ క్షణంలో ఏ చెరువు గట్టు తెగిపోతుందో..? అంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సాంప్రదాయంగా గ్రామీణుల నీటి అవసరాలు తీర్చే చెరువులు, నీటి సరస్సులు సంరక్షణకు శ్రీకారం చుట్టింది. ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై)లో భాగంగా నిర్లక్ష్యానికి గురై సామర్థ్యం కోల్పోవడం, నిరుపయోగంగా మారిన చెరువులను వినియోగంలోకి తీసుకురావాలనే సంకల్పంతో నీటి వనరులు 'మరమ్మతులు, నవీకరణ, పునరుద్ధరణ (ఆర్‌ఆర్‌ఆర్) పథకం ప్రయోగాత్మకంగా 2005లో ప్రారంభించారు. జల వనరుల సంరక్షణలో విజయవంతం కావడంతో దేశవ్యాప్తంగా సాంప్రదాయ నీటి వనరులైన చెరు వులు, సరస్సులు సంర క్షణ పనులకు శ్రీకారం చుట్టారు. ఫేజ్-3 కింద ప్రతిపాదనలు పంప మని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం కింద వెనుబడిన జిల్లాల కోటా లో 90 శాతం కేంద్రం నిధులిచ్చే అవకాశం ఉంది.

హోళగుంద మండలంలో కురుస్తున్న వర్షాలకు నిండిన హెబ్బటం పెద్దవంక చెరువు



21 చెరువులు.. 33.88 కోట్లు

జిల్లాలో 310 చెరువులు ఉన్నాయి. ట్రిపుల్ ఆర్ నిబంధనలు ప్రకారం మరమ్మతులు, పునరుద్ధరణ.. వంటి పనులు చేయాల్సిన చెరువులు 150-200లకు పైగానే ఉన్నాయి. అయితే.. కేవలం 21 చెరువులకు ట్రిపుల్ ఆర్ ఫేజ్-3 కింద రూ.33.83 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. కేవలం పత్తికొండ, కర్నూలు సబ్ డివిజన్ పరిధిలోకి వచ్చే పత్తికొండ నియోజకవర్గంలో 4 చెరువులకు రూ.7.14 కోట్లు, కోడుమూరు నియోజకవర్గంలో 5 చెరువులకు రూ.4.26 కోట్లు, పాణ్యం నియోజకవర్గంలో 5 చెరువులకు 4.89 కోట్లకు, మంత్రాలయం నియోజకవర్గంలో 2 చెరువులు రూ.8.90 కోట్లు, ఆలూరు నియోజకవర్గంలో 5 చెరువులకు రూ.8.68 కోట్ల ప్రతిపాదనలు పంపారు. ఆలూరు నియోజకవర్గంలో ఆస్పరి, దేవనకొండ మండలాలు చెరువులు పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలోకి ఉండడంతో ఫేజ్-3 ఆ చెరువులకు ప్రతిపాదనల్లో స్థానం దక్కింది. టీబీపీ ఎల్లెల్సీ పరిధిలోని 10 చెరువులకు రూ.12.98 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. స్టేట్ లెవల్ టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఫర్ ట్రిపుల్ ఆర్ కమిటీ ప్రాథమికంగా అంగీకరించినా, ప్రతిపాదనల్లో పలు లోపాలు కారణంగా ఆమోదం తెలపలేదు.

ట్రిపుల్ ఆర్ ఫేజ్-3 కింద ప్రతిపాదనలు రూ.కోట్లల్లో

నియోజకవర్గం	చెరువులు	ప్రతిపాదన
పత్తికొండ	4	7.14
కోడుమూరు	5	4.26
పాణ్యం	5	4.90
ఆలూరు	5	8.68
మంత్రాలయం	2	8.90
మొత్తం	21	33.88
ఎల్లెల్సీ చెరువులు	10	12.98
మొత్తం	31	46.86



ఆదోని మండలం డాణాపురం చెరువు దుస్థితి



హెబ్బటం చెల్లవంక చెరువు తూము, కాలువల దుస్థితి

రెండో విడతలో పంపుతాం

ట్రిపుల్ ఆర్ ఫేజ్-3 కింద కర్నూలు డివిజన్ నుంచి తొలి విడతలో 21 చెరువులకు ప్రతిపాదనలు పంపారు. మిగిలిన చెరువుల ప్రతిపాదనలు రెండో విడతలో పంపుతాం. ఏఈఈల కొరత ఉన్నమాట నిజమే. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- శ్రీనివాసులు, ఈఈ, మైనర్ ఇరిగేషన్ శాఖ, కర్నూలు

మైనర్ ఇరిగేషన్ (ఎంఐ)లో ఏఈఈ వివరాలు

సబ్ డివిజన్	పోస్టులు	భర్తీ చేసినవి	ఖాళీలు
పత్తికొండ	4	4	--
ఆదోని	4	–	4
డోన్	6	3	3
కర్నూలు	4	3	1
మొత్తం	18	10	8

ఆదోని సబ్ డివిజన్‌పై ఎందుకీ నిర్లక్ష్యం

ఆదోని మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) సబ్ డివిజన్ పరిధిలో ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజక వర్గాలులోని ఆదోని, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, ఆలూరు, చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో ఎంఐ చెరువులు 12, పంచాయతీరాజ్ చెరువులు 45కు పైగా ఉన్నాయి. ఎంఐ మేజర్ చెరువులు మరమ్మతులు, నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. ఈ సబ్ డివిజన్‌లో డీఈఈతో పాటు నలుగురు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ) పని చేయాలి. డీఈఈ, ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నెల రోజుల క్రితం పదోన్నతుల బదిలీల్లో భాగంగా ఆదోని ఎంఐ సబ్ డివిజన్ డీఈఈగా రాజగోపాల్ బదిలీపై వచ్చారు. విధుల్లో చేరిన మరుసటి రోజే సెలవుపై వెళ్లారు. ఈ నెలాఖరుకు రిటైర్డ్ అవుతుండడంతో గురువారం విధుల్లో చేరారు. అంటే.. ఆయన ఉన్నా ప్రయోజనం శూన్యం. ఇంజనీర్లు కొరత కారణంగా ట్రిపుల్ ఆర్ ఫేజ్-3 కింద ఒక్క చెరువుకు కూడా ప్రతిపాదనలు పంపలేదు. గత వైసీపీ ప్రభుత్వం ఆఖరులో అప్పటి ఎమ్మెల్యేల సిఫారు లేఖలతో పశ్చిమ ప్రాంతంలో పని చేసే మెజార్టీ ఇంజనీర్లు కర్నూలు క్వాలిటీ సెల్‌లో చేరిపోయారు. ఇక్కడ పని లేకపోయినా 16 మంది ఇంజనీర్లు ఉన్నారు. పల్లెల్లో సాగు, తాగునీరు అందించే చెరువుల నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన ఇంజనీర్లు కొరత వెంటాడుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చాకైనా ఇంజనీర్లు వస్తారను కుంటే.. కొందరు ప్రజాప్రతినిధుల నిర్వాకం శాపంగా మారింది. సిఫారు లేఖ లేనిదే ఏఈఈలను నియమి ంచడం లేదు.. ఆ లేఖకు ఓ రేటు ఉండడంతో ఒక్కరూ ముందుకు రావడంలేదనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్ప టికైనా స్థానిక ఎమ్మెల్యేలు జలవనరుల శాఖ ఈఎన్సీ స్థాయి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆదోని ఎంఐ సబ్ డివిజన్‌కు డీఈఈ, ఏఈఈలను నియమించాల్సిన అవ సరం ఎంతైనా ఉంది. మరమ్మతుల మాట దేవుడెరుగు.. వర్షాలకు గుండ్లు పడితే పూడ్చేనాథుడే ఉండరు.

మాదక ద్రవ్యాల వినియోగం అరికట్టాలి

- కలెక్టర్ రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం పూర్తిగా అరికట్టా లని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో 'నషా ముక్త్ భారత్ అభియాన్' అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం 'నషా ముక్తభారత్ అభియాన్' ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సమావేశంలో ఏడీ డిజేబుల్డ్ రయిస్ ఫాతిమా, లీగల్ సెల్ అడ్వకేట్ హేమలత, మెప్మా పీడీ నాగ శివలీల, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డా.శాంతికళ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డీఈవో శామ్యూల్‌పాల్, డీఎస్పీ బాబుప్రసాద్ పాల్గొన్నారు.

- జూన్ 1 నుంచి 7 వరకు పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. జూన్ 8 నుంచి జూన్ 14 వరకు వాల్ పెయింటింగ్స్, పోస్టర్లు తయారు చేయించి యూనివర్సిటీలు, కాలేజీలు, స్కూళ్లలో విస్తృతంగా ప్రచారం చేయాలని, జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. జూన్ 15 నుంచి 21వ తేదీ వరకు చర్చలు, కాంపిటీషన్స్, సెమినార్లు, వెబ్‌నార్లు నిర్వహించాలని ఆర్‌ఐవో, డీవీఈవోలను ఆదేశించారు. జూన్ 22 నుంచి 26 వరకు కర్నూలు మున్సిపల్ కమిషనర్, కమ్యూనిటీ మెంబర్స్, స్వచ్ఛంద సంస్థల ద్వారా అవగాహన ర్యాలీలు, సంతకాల సేకరణ, బైక్ ర్యాలీలు తదితర కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూన్ 26న ప్రతి కార్యాల యంలో, ప్రతి స్కూల్, కాలేజీ, యూనివర్సిటీలో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

మాల్ ప్రాక్టీసు కేసులు నిల్: డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ శుక్రవారం జరిగిన పరీక్షలో ఎలాంటి మాల్ ప్రాక్టీసు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులు 10,027 మంది నమోదు చేసుకోగా, 7,894 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 2133 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే పదో తరగతి ఓపెన్ స్కూల్ విద్యార్థులు 380 మందికి గాను 334 మంది హాజరయ్యారు. 46 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్ విద్యార్థులు 200 మందికి గాను 180 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ 5 పరీక్ష కేంద్రాలను, సహాయ కమిషనర్ 5, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 31 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.


స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా జిల్లా విద్యాశాఖ అధికారి వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ శుక్రవారం తెలిపారు. ఈ జాబితాలోని ఉపాధ్యాయులు తమ ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు ఎస్సీ ఉపాధ్యాయులు కుల ధృవీకరణ పత్రం, పీహెచ్ ఉపాధ్యాయులు ఒరిజినల్ పత్రాలతో పాటు మెడికల్ బోర్డు ద్వారా 24-04-2025 తర్వాత జారీ చేసిన పత్రాలు సర్వీసు రిజిస్టర్‌తో ఈ నెల 24న ఉదయం పది గంటలకు కర్నూలు- బళ్లారి రోడ్డులోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో హాజరు కావాలని తెలిపారు.

సబ్సిడీల్ కాలేదు..!



- సీడ్స్ సంస్థ, ఆర్గనైజర్ల మధ్య కుదరని సయోధ్య
- బకాయిలు చెల్లించాలంటున్న సీడ్స్ ఆర్గనైజర్లు
- రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ ఎప్పుడో..?
- ఆందోళనలో రైతాంగం



కర్నూలు అగ్రికల్చర్, మే 23 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ విత్తనాల విషయంలో సీడ్స్ ఆర్గనైజర్లకు, ఏపీ సీడ్స్ సంస్థకు మధ్య సయోధ్య కుదరలేదు. దీంతో రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీపై గందరగోళం నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో రైతులు దుక్కి చేసుకుంటున్నారు. పంటల సాగుకు సంబంధించి విత్తనాల కోసం వారు దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ప్రభుత్వం వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ఉమ్మడి జిల్లాకు 11వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రాయితీపై అందిం చేందుకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ యంత్రాంగానికి అనుమతి ఇచ్చింది. వేరుశనగ విత్తనాల పూర్తి ధర కూడా ఎంతో నిర్ణయించింది. అయితే.. సబ్సిడీ ఎంత ఇస్తుందో ప్రభుత్వం ఇంత వరకు నిర్ణయం తీసుకోకపోవడంతో ఏపీ సీడ్స్ అధికారులు రాయితీ విత్తన సేకరణ విషయంలో గందరగోళానికి గురవుతున్నారు.

గతేడాది ఇదే సమయంలో..

గతేడాది ఇదే సమయానికి రాయితీ వేరుశనగ విత్తనాల సేకరణను మొదలు పెట్టారు. ఇప్పుడు మాత్రం మే నెల ముగిసిపోతున్నా కనీసం ఒక క్వింటం వేరుశనగ విత్తనాలను కూడా సేకరించేందుకు వీల్లేని పరిస్థితులను ఏపీ సీడ్స్ సంస్థ ఎదుర్కొం టుంది. సబ్సిడీ ఎంతో నిర్ణయిస్తే గానీ తాము వేరుశనగ విత్తనాలను సిద్ధం చేసేందుకు ప్రయత్నాలు చేయలేమని వ్యాపారులు (ఆర్గనైజర్లు) తేల్చి చెబుతున్నారు. అదే విధంగా గత వైసీపీ ప్రభుత్వం గత ఏడాది ఖరీఫ్‌లో వ్యాపారుల నుంచి సేకరించిన వేరుశనగ విత్తనాలకు సంబంధించి బకాయిలు ఇప్పటి దాకా చెల్లించలేదు. రాష్ట్రం మొత్తం మీద రూ.100కోట్ల దాకా అప్పటి ప్రభుత్వం ఆర్గనైజర్లకు చెల్లించకపోవడంతో పాతబకాయిలు ఇస్తేనే వచ్చే ఖరీఫ్‌కు వేరుశనగ విత్తనాలను సిద్ధం చేస్తామని, లేకపోతే తమ వల్ల కాదని ఏపీ సీడ్స్ అధికారులకు ఆర్గనైజర్లు తేల్చి చెప్పేశారు.



వడ్డీలకు తెచ్చి విత్తనకాయలు..

దాదాపు ఏడాది గడువు తీరిపోయినా ఇంకా బకాయిలు చెల్లించకుంటే తాము ప్రస్తుతం రైతుల నుంచి నాణ్యమైన వేరుశనగ విత్తనకాయలను ఏవిదంగా కొనుగోలు చేయాలని, వడ్డీలకు తెచ్చి అప్పులు సమకూర్చుకుని విత్తనకాయలు కొనుగోలు చేసే పరిస్థితి తమవద్ద లేదని ఆర్గనైజర్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల వల్ల రైతులకు ఈ నెలాఖరులోపు రాయితీ వేరుశనగ విత్తనాలు అందించే అవకాశం లేదని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్గనైజర్లకు ఇవ్వాల్సిన బకాయిలను విడుదల చేయడంతో పాటు సబ్సిడీ ఎంత ఇస్తారో నిర్ణయం తీసుకుంటే తప్ప రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ కనీసం జూన్ మొదటి వారానికైనా జరుగుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

త్వరలో పంపిణీ చేస్తాం

వచ్చే ఖరీఫ్‌లో రాయితీ వేరుశనగ కాయలను రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ విత్తన కాయల పూర్తి ధరను ప్రభుత్వం క్వింటానికి రూ.9,300గా నిర్ణయించింది. సబ్సిడీ ఇంకా ఖరారు చేయలేదు. త్వరలోనే ప్రభుత్వం బకాయిలను త్వరలోనే విడుదల చేస్తుందని ఆశిస్తున్నాం. సబ్సిడీ మొత్తంపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రైతులు ఆందోళన చెందొద్దు.

- ధనలక్ష్మి, ఏపీ సీడ్స్ మేనేజర్

అయ్యో పాపం..!

- రైల్వే శాఖ నిర్లక్ష్యానికి పసివాడు బలి
- గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో విషాద ఘటన
- కర్నూలు నుంచి రామేశ్వరం వెళుతుండగా..



మృతిచెందిన మణికంఠ



అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద విలపిస్తున్న తల్లి దండ్రులు

వేసవి సెలవుల్లో పుణ్యక్షేత్రాల సందర్శనకు అమ్మానాన్న, బంధువులతో కలిసి సంబరంగా బయలుదేరాడు ఏడేళ్ల మణికంఠ. కర్నూలు నుంచి గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు రాత్రికే చేరుకున్నారు. ఉదయాన్నే రైలు ఎక్కుతారు. ఆ పిల్లవాడికి ఎంత ఎంత సంబరమో..! కలలుగంటూ ప్లాట్‌ఫాంపై పడుకున్నాడు. మరో రెండు గంటలు గడిస్తే.. రైలు ఎక్కి రామేశ్వరానికి బయలుదేరేవాడు. కానీ శిథిలావస్థలో ఉన్న పైకప్పు పెచ్చులు ఊడి పసివాడి తలపై పడింది. రక్తం ధారలు కట్టింది. అమ్మానాన్న కంగారుగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేకపోయింది..!

(వివరాలు మెయిన్‌లో)

మామిడికాయకు జూట్ కవర్



గోపవరం సమీపంలోని తోటలో మామిడికాయలకు కవర్లు ఏర్పాటు చేసిన దృశ్యం

మహానంది, మే 23 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అంతంత మాత్రం ఉన్న మామిడి పంట దిగబడిని కాపాడుకొనేందుకు కౌలు రైతు జూట్ బ్యాగులను ఏర్పాటు చేసుకున్నాడు. మహానంది మండలం గోపవరం సమీపంలోని 4 ఎకరాల మామిడి తోటను శిరివెళ్ళ మండలం బోయలకుంట్లకు చెందిన రైతు ఆంజనేయులు రూ. 5 లక్షలకు కౌలుకు తీసుకొన్నాడు. గత ఏడాది కన్నా దిగుబడి తక్కువ రావడంతో ఉన్న మామిడి కాయలను కాపాడు కొనేందుకు వినూత్న ప్రయోగం చేసాడు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాలలో రూ.3 ప్రకారం చిన్న సైజు జూట్ కవర్‌ను కొనుగోలు చేసి ఏర్పాటు చేసాడు. దీనివల్ల మామిడి కాయను చీడపురుగుల నుండి కాపాడుకోవచ్చని అన్నాడు. రుచి, నాణ్యత గల మామిడిపండ్లను కొనుగోలు చెయ్యడానికి మామిడి పండ్ల ప్రియులు ఆసక్తి చూపుతారని రైతు తెలిపారు. సాధారణ మామిడిపండ్లు కిలో రూ వంద ఉండగా జూట్ బ్యాగు తొడిగిన కవర్లలోని పండ్లు కిలో రూ. 150 నుండి 200 వందలు పలుకుతాయని అన్నారు.

హరివిల్లు



సంధ్యవేళ హరివిల్లు చూపరులను ఆకట్టుకుంది. సాయంత్రం ఓవైపు నీలి మబ్బులు ముసురుకుంటుండగా, మరోవైపు నుంచి భానుడి ప్రకాశిస్తున్న సాయం సంధ్యవేళ దేవనకొండలో ఇంద్రధనస్సు దర్శనమిచ్చింది. దాని రంగుల అందాలు చూసి చిన్నారులు కేరింతలు కొట్టారు. ప్రకృతిలోని అద్భుతాన్ని చూసి ఆనందించారు. మరి కొంతమంది సెల్‌ఫోన్లలో ఈ దృశ్యాలను బంధించారు.

- దేవనకొండ (ఆంధ్రజ్యోతి)

మండే ఎండల్లో తుంగభద్రకు వరద



కర్నూలు సమీపంలో తుంగభద్ర నదిలో వరద ప్రవాహం

- సుంకేసుల గేట్లు ఎత్తి శ్రీశైలానికి 8,464 క్యూసెక్కులు విడుదల
- జిల్లాలో 166 శాతం అధిక వర్షపాతం నమోదు
- ముందస్తు సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులు

కర్నూలు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలంలో తుంగభద్రకు వరద చేరడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మే ఎండల్లో ప్రజలు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతోంటే కర్నూలు ముంగిట భారీ వర్షాలు కురుస్తున్నాయి. రికార్డు స్థాయిలో 166 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మునుపెన్నడు ఇలాంటి వర్షాలు చూడలేదని, తుంగభద్రకు ఎండాకాలంలో వరద రావడం ఇదే మొదలని కర్నూలు మండలం మునగాల గ్రామానికి చెందిన 75ఏళ్ల వృద్ధుడు నరసింహప్ప పేర్కొన్నారు. ఏడాదికి 27కార్తెలు ఉంటాయి. ప్రతి కార్తె వ్యవసాయానికి సంబంధించిన నిర్దిష్ట కాలాన్ని సూచిస్తుంది. సహజంగా కృతిక కార్తె మే 11న ప్రారంభం అవుతుంది. ఈ కార్తెలో ఎండలు అధికంగా ఉంటాయి. 39 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. ఆ తరువాత రోహిణి కార్తె మే 25న ప్రారంభమై జూన్ 8వ తేది వరకు ఉంటుంది. ఈకార్తెలో కూడా అతి తీవ్ర ఎండలు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు. అలాంటి మే నెలలో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవడమే కాదు.. తుంగభద్ర, హంద్రీ, వేదవతి నదులకు వరద చేరడం పాతికేళ్లలో రికార్డు అని ఇంజనీర్లు అంటున్నారు.

166 శాతం అధిక వర్షపాతం

మే నెలలో సాధారణ వర్షపాతం 29.7 మిల్లీమీటర్లు (ఎంఎం) కాగా.. ఇప్పటికే 79.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మునుపెన్నడు లేని విధంగా 166 శాతం అధిక వర్షపాతం నమోదు కావడం కొసమెరుపు. జిల్లాలో అత్యధికంగా హొళగుంద మండలంలో 35.6 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉంటే.. ఇప్పటికే 159.6 మి.మీలు పడింది. హాలహర్వి మండలంలో కూడా 102 మి.మీలు వర్షపాతం నమోదు అయ్యింది. సరిహద్దులో ఉన్న వేదవతి నదికి వరద పోటెత్తడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర నదికి ఈఏడాది ముందుగా వరద చేరింది. సుంకేసుల బ్యారేజీకి శుక్రవారం 8,305 క్యూసెక్కుల వరద చేరింది. గేట్లెత్తి దిగువ శ్రీశైలం జలాశయానికి 8,464 క్యూసెక్కులు విడుదల చేశారు. మంగళ, బుధ, గురువారాల్లో 12 వేల క్యూసెక్కులకు పైగా వదిలారు. కర్నూలు నగరం శివారులో తుంగభద్ర జలకళతో ప్రకృతి ప్రేమికులను అహ్లాద పరుస్తుంది. కర్ణాటకాంధ్ర జీవనాడి తుంగభద్ర జలాశయానికి సైతం ముందస్తు వరద నమోదు అవుతుంది. 6,782 క్యూసెక్కులు వరద ఎగువ నుంచి డ్యాంకు వచ్చి చేరుతుంది. నదీ తీర గ్రామాల అవసరాల నిమిత్తం 2,082 క్యూసెక్కులు నదికి విడుదల చేస్తున్నారు. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, పూర్తిస్థాయి నీటి మట్టం 105.788 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1589.3 అడుగుల వద్ద 10.457 టీఎంసీలు నిల్వ ఉంది.

అత్యధికంగా వర్షపాతం నమోదైన మండలాలు.. మిల్లీ మీటర్లలో

మండలం	సాధారణ	నమోదు
నందవరం	25.2	100
కల్లూరు	30.5	128.4
కర్నూలు రూరల్	27.3	141.8
కోడుమూరు	30.9	114.8
గోనెగండ్ల	19.4	91.6
హొళగుంద	35.6	159.6
హాలహర్వి	26.9	102
పత్తికొండ	36.7	100.2
మద్దికెర	25.9	90.4
తుగ్గలి	31.1	124
కర్నూలు అర్బన్	27.3	105
జిల్లాలో పడిన వర్షం	773.3	2,059.8
జిల్లా సగటు వర్షపాతం	29.7	79.2



కర్నూలు నగరానికి అనుకొని ప్రవహిస్తున్న తుంగభద్ర జల అందాలు

104 రీజనల్ మేనేజర్‌గా షేక్ ఇక్బాల్ హుసేన్



డీఎంహెచ్‌వోను కలిసిన 104 భవ్య హెల్త్ సర్వీసెస్ రీజనల్ మేనేజర్

కర్నూలు హాస్పిటల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 104, అంబులెన్స్ నిర్వహణకు ప్రభుత్వం భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కొత్త సర్వీసు ప్రొవైడర్‌ను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా జిల్లా 104 భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రొవైడర్ రీజనల్ మేనేజర్‌గా నియమితుడైన షేక్ ఇక్బాల్ హుసేన్ శుక్రవారం డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 104 వాహనాల ద్వారా గ్రామీణులకు రోగ నిర్ధారణ పరీక్షలతో పాటు సేవలు అందించాలని ఆదేశించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం: డీఈవో



విద్యార్థినికి ప్రశంసాపత్రం, షీల్డ్‌ను అందజేస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని డీఈవో జనార్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నంద్యాల డీవైఈవో కార్యాలయంలో జిల్లా ఎస్‌జీసీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జీవ వైవిధ్య పోటీల్లో విజేతల బహుమతుల పంపిణీ కార్యక్రమానికి డీఈవో జనార్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతిథులుగా నంద్యాల డీవైఈవో శంకర్‌ప్రసాద్, డోన్ డీవైఈవో వెంకట్రా మిరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతిని ప్రేమిస్తూ మొక్కలను రక్షించి జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలని సూచిం చారు. ప్రతి విద్యార్థికి ప్రకృతి వనరులపై అవగాహన ఉండాలన్నారు. భూమిపై ఉండే జంతు, జీవరాశులను రక్షించి తద్వారా మంచి గాలి, ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జీవవైవిద్యానికి మూలాధారం పచ్చదనమని, అందరం కలిసి మొక్కలు నాటి వాటిని పరరక్షించి పర్యావరణాన్ని కాపాడుదామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషఫణి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు



కొవిడ్‌పై సమీక్షిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, మే 23 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ వైరస్‌పై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం కడప రిమ్స్ హాస్పిటల్‌లో నంద్యాల జిల్లాకు చెందిన ఓవ్యక్తికి కరోనా పాజిటివ్ అని నిర్ధారణ కావడంతో కర్నూలు జీజీహెచ్ అధికారులు అప్రమత్తమయ్యారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ఆదేశాల మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు తన చాంబరులో కొవిడ్ వైరస్‌ను ఎదుర్కొవడానికి అనుసరించాల్సిన ప్రోటోకాల్‌పై వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ఆర్ఎంవో డా.బీవీ రావు, పల్మనాలజీ, అనస్థీషియా, మెడిసిన్, పీడియాట్రిక్, ఎమర్జెన్సీ, మెడిసిన్, మైక్రోబయాలజీ వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మాస్కులు, పీపీఈ కిట్లు, యాంటి వైరల్ డ్రగ్స్ అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా డ్రగ్స్ స్టోర్ మెడికల్ ఆఫీసర్ డా. శారదను ఆదేశించారు. ఆక్సిజన్‌ను రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అనస్థీషియా వైద్యులకు సూచించారు. వైద్యులతో కూడిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధం చేసుకోవాలని సంబంధిత హెచ్‌వో డీలను ఆదేశించారు. పాత గైనిక్ వార్డులో కొవిడ్ ఐసోలేషన్ వార్డును సిద్ధం చేయాలని అనస్థీషియా ప్రొఫెసర్ డా. సుధీర్‌ను ఆదేశించారు. సమీక్షలో జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డా. ఇక్బాల్ హుశేన్, అనస్థీషియా హెచ్‌వోడీ డా. విశాల, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డా.నాగలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. విజయలక్ష్మి, ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సుబ్రహ్మణ్యం, డా. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

మహానందిలో దర్శకుడు త్రినాథరావు పూజలు



మహానందిలో సినీ దర్శకుడు త్రినాథరావు

మహానంది, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు త్రినాథరావు నక్కిన శుక్రవారం మహానంది క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రవితేజ హీరోగా నటించిన ధమాక సినిమాతోనే తనకు గుర్తింపు వచ్చిందన్నారు. నిర్మాత దిల్‌రాజు తనను ఎంతో ప్రోత్సహించారని చెప్పారు. త్వరలోనే ప్రముఖ తెలుగు హీరోతో తన దర్శకత్వంలో సినిమాను నిర్మిస్తు న్నామన్నారు. పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే సరియైన ఆలోచనతో కొత్తదనం ఉండే చిత్రాలను ఎంచుకోవాలని నక్కిన తెలిపారు. అభిమానులు ఆయనతో ఫొటో దిగడానికి ఆసక్తి చూపారు.

పలువురు ప్రముఖులు..

మహానంది క్షేత్రంలో శుక్రవారం పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు జరి పారు. ఆలయం వద్ద వీరికి ఏఈఓ యర్రమల్ల మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. వీరిలో ఏపీ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మతో పాటు నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ వేర్వేరుగా ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక అభిషేకార్చనలు జరిపారు. అనంతరం వీరిని కల్యాణ మంటపంలో వేదపండితులు ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలు అంద చేశారు. నంద్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, సీఐ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

కోనేటి నిర్మాణానికి రూ.1.80 కోట్ల విరాళం

- ఘనంగా భూమి పూజ
- దాతను సన్మానించిన ఆలయ సిబ్బంది



భూమి పూజలో పాల్గొన్న భక్తుడు మంజునాథ

కౌతాళం, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో కోనేటి నిర్మాణానికి ఓ భక్తుడు రూ.1.80కోట్లు విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ విజయ రాజు తెలిపారు. శుక్రవారం కోనేటి నిర్మాణానికి దాతతో కలిసి ఆలయ అధికారులు భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో విలేకరులతో మాటా డారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన స్వామివారి భక్తుడు మంజునాథ కోనేటి నిర్మాణానికి అవసరమయ్యే రూ.1.80కోట్లను తాను విరాళంగా అంది స్తానని ముం దుకు వచ్చారని తెలిపారు. దాతకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేకపూజలు చేయించారు. స్వామి వారి తీర్థప్రసాదాలను, శాలువాతో సన్మా నించి దేవుడి చిత్రపటంను అంద జేశారు. ఈ సందర్భంగా దాత మంజునాథ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు కార్యక్రమంలో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు ఈరప్ప స్వామి, మహదేవప్ప స్వామి, పూజన్న స్వామి, నాగరాజు స్వామి, ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వర్లు, వీరేష్, విజయకుమార్ ఉన్నారు.

కనీస సౌకర్యాల కల్పనే లక్ష్యం

- పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్
- రూ.12.30 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమని, కూటమి ప్రభుత్వానికి కనీస సౌకర్యాల కల్పనే లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచేలా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. శుక్రవారం కర్నూలు నియోజకవర్గ పరిధిలోని 19 వార్డులలో 15వ ఆర్థిక సంఘం, ఎస్‌క్యాప్, సాధారణ నిధులకు సంబంధించి రూ.12.30 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి, నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబుతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అశోక్‌నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద సీసీ రోడ్లు, కాలువలు, కేసీ కెనాల్ బ్రిడ్జి జలమండలి వద్ద సీసీ రోడ్లు, కాలువలు, ఎస్‌ఏపీ క్యాంపు జాతీయ రహదారి వద్ద కనెక్టివిటీ రోడ్డు, నగరేశ్వరస్వామి ఆలయం వద్ద సీసీ రోడ్లు, కాలువలు, బండిమెట్ట శ్రీపొట్టిశ్రీరాములు మున్సిపల్ పాఠశాల వద్ద సీసీ రోడ్లు, కాలువలు, బుధవారపేట హంద్రీ బ్రిడ్జి వద్ద సీసీ రోడ్లు, కాలువలు, సి. క్యాంపి సెంటర్‌లో రోడ్డు, సి. క్యాంపు నుంచి బిర్లాగేట్ పోస్టాఫీసు వరకు సీసీ రోడ్డు విస్తరణ పనులకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ నగరవాసులకు ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, వార్డుల్లో పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. వీటన్నింటిని కల్పించేందుకు తాను కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కురువ పరమేష్, క్రాంతికుమార్, రమణమ్మ, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఈఈ సత్యనారాయణ, డీఈఈలు క్రిష్ణలత, గంగాధర్, శ్రీనివాసరెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి

- బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు
- మానిటరీ రిలీఫ్ కింద ఆరు నెలల్లో బాధితులకు రూ.4 కోట్లు
- రాష్ట్రంలోనే అత్యధిక రిలీఫ్ ఫండ్ ఇచ్చింది కర్నూలు జిల్లా నుంచే..
- కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కృషి చేస్తోందని కలెక్టర్ రంజిత్ బాషా అ న్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్సీ, ఎస్టీ అత్యా చార నిరోధక చట్టం అమలుకు సంబంధించిన జిల్లా విజిలెన్స్ అండ్ మాని టరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, జిల్లా అధికారులు, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, అత్యాచార బాధిత కుటుంబాలకు త్వరి తగతిన న్యాయంజరిగి ఇతర ప్రయోజ నాలను అందించేందుకు ప్రత్యేకచర్యలు తీసుకుంటు న్నామన్నారు. గత ఆరు నెలల్లో బాధిత కుటుంబాలకు మానిటరీ రిలీఫ్ కింద రూ.4 కోట్లు అందించామన్నారు. ఇంకా పెండింగ్‌లో రూ.50లక్షలు ఉందని, ఆమొత్తాన్ని కూడా త్వరగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే ఇంత ఎక్కువ మొత్తంలో మానిటరీ రిలీఫ్ ఇచ్చిన జిల్లా కర్నూలు జిల్లా అని, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. హత్య కేసులకు సంబంధించి బాధితులకు ఇంటి స్థలం, ఉద్యోగం, త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. అలాగే ఇప్పటి వరకు 19 మందికి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. ఎస్సీ వసతి గృహాల మరమ్మతులకు గానూ రూ.7కోట్లు మంజూరు చేశారని, అందులో దాదాపు 80శాతం పనులు పూర్తయ్యాయని, పెండింగ్ చర్యలు త్వరగా పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నగరంలోని 18, 19 వార్డులలో అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటుమన్నామని తెలిపారు.

సభ్యులు చొరవ తీసుకోవాలి

కేసులకు సంబంధించి సోషల్‌మీడియాలో రుమర్లు వ్యాపింపచేయడంతో శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందని, అలా చేయకుండా సభ్యులు చొరవ తీసుకో వాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఏదైనా సమస్య ఉంటే సమావేశం వరకు ఆగ కుండా ఎస్పీ, కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే విదంగా చర్యలు తీసుకుం టామని ఎస్పీ సూచించారు. ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో సీ.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్, సాంఘీక సంక్షేమ అధికారి తులసిదేవి, డీవీఎంసీ సభ్యులు రవికుమార్, సురేష్‌గౌడు, వెంకట నాగరాజు యాదవ్, మాలతి, మధు నాయక్, మద్దిలేటి, కురువ మద్దిలేటి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బ్రిక్స్ సమావేశాలకు బైరెడ్డి శబరికి ఆహ్వానం

నంద్యాల రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎంపీ, లోక్‌సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరికి అరుదైన అవకాశం లభించినట్లు కేంద్ర పౌరసరఫరా సభ్యుడు నరహరి విశ్వనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం బ్రెజిల్‌లో జూలై 4 వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరిగే 11వ బ్రిక్స్ సమావేశాల్లో ఎంపీ పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు పేర్కొన్నారు. బ్రిక్స్ అగ్రసదస్సుకు భారత ప్రధానమంత్రి మోదీ నాయకత్వం వహించడం గర్వకారణమన్నారు. ఎంపీగా విజయం సాధించినప్పటి నుంచి ఆస్ట్రేలియా విక్టోరియా పార్లమెంట్‌లో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించడం జరిగిందన్నారు. బ్రెజిల్ దేశంలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనాలని ఆహ్వానం అందడం ఎంతో అభినందనీయమన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాష్ బిర్లా నాయకత్వంలో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివాన్ష్‌తో కూడిన బృందంలో ఎంపీ పాల్గొంటారన్నారు.



28న విచారణకు హాజరుకండి

కోవెలకుంట్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న కర్నూలు జిల్లాపరిషత్‌లో జరిగే విచారణకు హాజరుకావాలని జడ్పీ సీఈవో నాసరరెడ్డి కోవెలకుంట్ల ఎంపీపీకి నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీవో వర ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానించి ఆమోదం పొందిన పనుల్లో ఎంపీపీ రమాదేవి కొట్టివేశారన్నారు. దీనిపై తాను జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 22న సీఈవో కోవెలకుంట్లకు వచ్చి విచారణ జరిపి రిపోర్టు తయారు చేశారన్నారు. మరలా 28న జడ్పీలో హాజరు కావాలని నోటీసులు అందించగా వాటిని ఎంపీపీకి పంపినట్లు తెలిపారు.

బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలి

- జడ్పీ సీఈవో నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా పరిషత్ పరిధిలోని కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీలకు దరఖాస్తు చేసుకో వాలని జడ్పీ సీఈవో జి. నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 5 సంవత్సరాలు పూర్తి చేసిన ఉద్యోగులకు బదిలీలు చేపట్టే నిమిత్తమై మార్గదర్శకాలను అందరి కార్యాలయాల అధిపతులకు పంపించారు. సంబంధిత అధికారులు అర్హత కలిగిన ఉద్యోగుల నుంచి దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి ఈ నెల 27వ తేదీ లోపల జడ్పీ కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు. 27 తరువాత వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోమని స్పష్టం చేశారు.

పని వేళలు పాటించాలి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి

కర్నూలు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు సమయ పాలన పాటించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మద్యం దుకాణాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. మద్యం దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు. మద్యం దుకాణాల వద్ద నిబంధనల అమలు కోసం గస్తీ బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐలు ఆకస్మిక తనిఖీలుచేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, సీఐలు జయరాంనాయుడు, రాజజేంద్ర ప్రసాద్, దుర్గా నవీన్‌బాబు, సీఐలు, ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

నంద్యాల టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): నంద్యాల పోన్నాపురం వద్ద రైలునుంచి జారిపడి వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు.. కందుకూరు మండలం మదాపురం గ్రామానికి చెందిన మాల కొండయ్య శుక్రవారం తెల్లవారు జామున ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి గుంతకల్లుకు వెళ్తూ ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందపడి చనిపోయాడు. మృతుడి కటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎంవీఐపై దాడి కేసులో కర్ణాటక వాసికి రిమాండ్

ఆదోని రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎంవీఐ కదిరి మహ్మద్ అవేస్‌పై దాడి చేసిన కేసులో కర్ణాటక వాసి చంద్రప్పకు న్యాయాధికారి 14 రిమాండ్ విధించారు. గురువారం ఎంవీఐపై దాడి చేసిన విషయం విదితమే. ఎంవీఐ ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్.ఐ కేసు నమోదు చేసి శుక్రవారం ఆదోని ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జెఎఫ్‌సిఎం కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి నిందితుడికి రిమాండ్ విధించారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు

- సారా అమ్మకం, తయారీదారులను బైండోవర్ చేశాం
- 'నవోదయం-2.0' విజయవంతం చేయండి
- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ



అధికారులతో మాట్లాడుతున్న రాహుల్‌దేవ్ శర్మ

నంద్యాల టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి రవికుమార్ అధ్యక్షతన జిల్లాలోని ఎస్‌హెచ్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సారాను జిల్లానుంచి సమూలంగా నిర్మూలించాలన్నారు. సారా అమ్మే, తయారు చేసేవారిపై దాడులు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారి స్థావరాలపై దాడులు చేసి బెల్లం ఊటను ధ్వంసం చేసి బైండోవర్ చేశామన్నారు. బార్లు నియమాలను పాటించకపోయినా, సారా అమ్మినా చర్యలు తీసుకోవాలని సీఐలను హెచ్చరించారు. జిల్లాను సారా రహిత జిల్లాగా చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి స్టేషన్ పనితీరు అడిగి తెలుసుకుని సూచనలు ఇచ్చారు. నంద్యాల జిల్లా కేంద్ర కార్యాలయాన్ని తనిఖీ చేశారు. 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో భాగంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. డీసీ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, అసిస్టెంట్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారి మునిస్వామి, ఉమ్మడి జిల్లాల సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహానాడులో జిల్లాకు గుర్తింపు తేవాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడుకు భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తేవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం జిల్లాస్థాయి మహానాడుకు అన్ని నియోజ కవర్గాల ఎమ్మెల్యేలు, ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవా దాలు తెలిపారు. గతంలో ఎన్నడూ లే ని విధంగా హాజరై జిల్లాలోని పార్టీ ఐక్యతను చాటడం అభినందనీయమని కొనియాడారు. ఏడు నియోజకవర్గాలతో పాటు నగరంలో 16 వార్డుల్లో పాణ్యం నియోజవర్గం ఉండటంతో పాణ్యం ఇన్‌చార్జీ కూడా హాజరై పార్టీ చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రతికార్యకర్తకు భరోసా ఇచ్చే విధంగా చర్చలు, తీర్మాణాలను రాష్ట్ర మహానాడుకు పంపామని పెర్కొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు బాలికల మృతి

- మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు
- గోనెగండ్లలో విషాదం



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

గోనెగండ్ల, మే 23(ఆంధ్రజ్యోతి): ఈతకెళ్లి ఇద్దరు బాలికలు మృతిచెందారు. ఈ ఘటన గోనెగండ్లలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బోయ మందకల్లు, బోయ సరస్వతికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. వీరు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి రెండో కుమార్తె బోయ మాధురి(12) ఆరో తరగతితో చదువు మానేసింది. అదే వీధి సమీపంలో బోయ రంగప్పనాయుడు, బోయ మహేశ్వరి లకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరు కూడా కూలీ పనులు చేసి జీవనం సాగించేవారు. వీరి రెండో కుమార్తె బోయ మంజుల(12) కూడా పొలం పనులకు వెళ్లేది. అయితే శుక్రవారం ఇద్దరు బాలికల తల్లులు సరస్వతి, మహేశ్వరి గ్రామానికి చెందిన కురువ నాగరాజు పొలంలో కూలీ పనులకు వెళ్లారు. బాలికలు కూడా తమ తల్లులతో పాటు పొలంకు వెళ్లారు. పత్తి విత్తనాలు విత్తే పనులు మధ్యాహ్నం ఒంటి గంట లోపు పూర్తయ్యాయి. అయితే పిల్లలద్దరు తమ తల్లులకు చెప్పకుండా నాగరాజు పొలంలో ఉన్న నీటి తొట్టిలో ఈతకెళ్లారు. ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి పోయారు. ఇద్దరికి ఈత రాక పోవడంతో నీటిలో పూర్తిగా మునిగి పోయారు. వారి అరుపులు కూడా పొలంలోని వారికి వినిపించలేదు. నీటిలో ఊపిరాడక మృతి చెందారు.

ఎంత సేపటికి తమ పిల్లలు కనిపించక పోవడంతో సరస్వతి, మహేశ్వరి పొలంలో వెతికారు జాడ కనిపించ లేదు. నీటి తొట్టి వైపు వెళ్లి చూడగా అక్కడ మాధురి, మంజుల ఇద్దరు శవాలై నీటి తొట్టిలో కనిపించారు. తల్లులు రోదనలతో చుట్టుపక్కల పొలాల్లో పనిచేసే వారు అక్కడికి చేరుకొని నీటి తొట్టి నుంచి బయటకు తీశారు. అప్పటికే ఇద్దరు మృతిచెందారు. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు రోదనలతో ఆ ప్రాంతం శోకసంద్రంగా మారింది. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.



బోయ మాధురి(ఫైల్)



బోయ మాధురి(ఫైల్)

27న జాబ్ మేళా

కర్నూలు అర్బన్/ నంద్యాల ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిరుద్యోగులకు ఈనెల 27న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి పి. సోమశేఖరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి నేషనల్ ఐటీఐ కాలేజీ, జ్ఞానాపురం, మూల సాగరం రోడ్డు నంద్యాలలో నిర్వహించే జాబ్‌మేళాకు ఫ్లిప్ కార్టు, యంగ్ ఇండియా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, డెలివరీబాయ్, ట్రైనీ మేనేజర్ పోస్టులకు పదో తరగతి చదివిన విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైనవారికి నెలకు రూ. 10వేల వేతనం ఉంటుందని తెలిపారు. ధ్రువపత్రాలు తీసుకుని రావాలన్నారు.

ఇద్దరు విద్యార్థులు డిబార్

కర్నూలు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 7,112 మంది దరఖాస్తు చేసుకోగా 6,414 మంది హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు. రావుస్ డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరులో ఒకరు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోస్గిలో ఒకరు మాస్ కాపీయింగ్ పాల్పడటంతో డిబార్ చేశామన్నారు.

'రియల్' అభివృద్ధికి ప్రోత్సాహం

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- ఘనంగా 'క్రెడాయ్' ప్రాపర్టీ అండ్ బిల్డ్‌టెక్ షో ప్రారంభం



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు కల్చరల్, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో, కర్నూలు క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'క్రెడాయ్ ప్రాపర్టీ అండ్ బిల్డ్‌టెక్ షోను ఆయన రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రదర్శనల్లో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ ఓర్వకల్లులో పెద్దఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, బిల్డర్లు ఎవరైనా అక్కడ స్టార్‌హోటల్‌ను నిర్మిస్తే ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. క్రెడాయ్ సంస్థ వారు రియల్ ఎస్టేట్‌నకు సంబంధించిన అన్నింటినీ ఈ ప్రదర్శన ద్వారా ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన 'క్రెడాయ్' ప్రాపర్టీ షో

ఎస్టీబీసీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రెడాయ్ ప్రాపర్టీ షో ఘనంగా ఆరంభమైంది. క్రెడాయ్ సంస్థ కన్వీనర్ ఎన్.శ్రీనివా సరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ప్రాపర్టీ ప్రదర్శనకు విశేష ఆదరణ లభిస్తోందని, ఇది తమ ఆరో ఎడిషన్ అని తెలిపారు. సామాన్య ప్రజలకు సైతం స్వంత ఆస్తిని చేకూర్చాలనే లక్ష్యంగా క్రెడాయ్ సంస్థ పనిచేస్తోందన్నారు. క్రెడాయ్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్‌రెడ్డి ఇంటి స్థలాలు, ఇళ్లు, ప్లాట్లు వంటివి విక్రయించడమే కాకుండా అందుకు కావాల్సిన సహకారం అందించే నిర్మాణ సంస్థలు, ఇంటీరియర్స్, బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్ బ్యాంకింగ్ రంగ సంస్థలు ఈ ప్రదర్శనలో ఉన్నాయని అన్నారు. క్రెడాయ్ ఛైర్మన్ గోరంట్ల రమణ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా ప్రజలకు అవస రమైన రుణాలను ఆకర్షణీయమైన ఈఎంఐ చెల్లింపు పద్ధతిలో అందించుటకు ముందుకు వచ్చాయని తెలిపారు. స్టాల్స్ సందర్శకులను బాగా ఆకర్షించాయని క్రెడాయ్ కోశాధికారి టీపీవీ ప్రకాష్ తెలిపారు. ఈ షోకు విచ్చేసిన అతిథులకు క్రెడాయ్ సంస్థ కార్యదర్శి పి. గోవర్ధనరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

కాపు, బీసీ భవన నిర్మాణ పనుల పరిశీలన

కర్నూలు ఎడ్యుకేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని బీ క్యాంపులో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న కాపు, బీసీ భవన నిర్మాణ పనులను శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ పరిశీలించారు. ఈ పనులను 2018 ఏప్రిల్ 11వ తేదీన బీసీ కాపు భవన నిర్మాణ పనులకు అప్పటి ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి శంకుస్థాపన చేశారు. అప్పట్లో భవన నిర్మాణ పనులు కూడా చురుగ్గా సాగాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నిర్మాణానికి అవసరమయ్యే నిధులను విడుదల చేయలేదు. దీంతో భవన నిర్మాణం సంబంధించిన కడ్డీలు తుప్పు పడుతున్నాయి. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ ఈ భవన నిర్మాణాలకు అవసర మయ్యే నిధుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుసేన్ తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

పోలీసు కస్టడీలో గుమ్మనూరు నారాయణ

- చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారించిన పోలీసులు
- తిరిగి కర్నూలు సబ్‌జైలుకు తరలింపు

ఆలూరు, మే 23(ఆంధ్రజ్యోతి): ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసులో ఆలూరు మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణను విచారణ కోసం న్యాయవాది పర్యవేక్షణలో పోలీసులు కర్నూలు సబ్‌జైలు నుంచి గురువారం కస్టడీలోకి తీసుకున్నారు. చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీర, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హత్య కేసుపై విచారణ జరిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆలూరు కోర్టులో ప్రవేశపెట్టి తిరిగి కర్నూలు సబ్ జైలుకు తరలించారు. కాంగ్రెస్ నేత లక్ష్మీనారాయణ హత్య కేసులో టీడీపీ నేత గుమ్మనూరు నారాయణ ఈనెల 13న అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్నాడు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

ఆళ్లగడ్డ మే 23(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పట్టణంలో శుక్రవారం సాయంత్రం ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ముఠాను అరెస్టు చేసి వారి నుంచి రూ 2.06 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. ఆళ్లగడ్డ డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి నిందితుల అరెస్టును చూపించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌పై చాగలమర్రి లోని మల్లెవేముల రస్తాలో యువకులు బెట్టింగ్ ఆడుతున్నారని సమాచారం అందడంతో దాడి చేశారు. వీరి నుంచి నాలుగు సెల్‌ఫోన్‌లు, స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. బెట్టింగ్ రాయుళ్లు ఖాజీమహమ్మద్ రఫి, మద్దులేటిరెడ్డి, చాకలి హరికృష్ణ, బాబాఫక్రుద్దీన్, షేక్ షరీఫ్ అనే వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, చాగలమర్రి ఎస్ఐ సురేష్ నాయకుడు పాల్గొన్నారు.



నిందితులను చూపుతున్న డీఎస్పీ ప్రమోద్

కరోనా కలకలం

- అప్రమత్తమైన జిల్లా వైద్య యంత్రాంగం
- పాజిటివ్ లేదని వైద్యుల నిర్ధారణ

నంద్యాల హాస్పిటల్/చాగలమర్రి, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కరోనా పాజిటివ్ కేసు అంటూ సోషల్ మీడియాలో కలకలం రేగింది. దీంతో వైద్య యంత్రాంగం అప్రమత్తమైంది. నంద్యాల జిల్లాలోని చాగలమర్రికి చెందిన షేక్ గౌస్‌మోదిన్‌బీ అనే వృద్ధురాలు జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతూ కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లింది. అక్కడి వైద్యులు కడప జీజీహెచ్‌కు వెళ్లమని చెప్పారు. కడప జీజీహెచ్‌లో చికిత్సపొందు తున్న ఆమెను కరోనా వార్డులో ఉంచారు. దీన్ని కరోనా సోకిందంటూ వైరల్ అయింది. చాగలమర్రిలోని వృద్ధురాలి ఇంటికి వైద్యబృందం వెళ్లి పరిసర ప్రాంత ప్రజలతో జబ్బుల గురించి తెలుసు కున్నారు. ఆమె కుటుంబంలోని వారికి ఏదైనా వైద్య సమస్యలు ఉన్నాయా అని పరిశీలించారు. ఎలాంటి వైద్యసమస్యలు లేకపోవడంతో వైద్య యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు

చాగలమర్రికి చెందిన వృద్ధురాలు కరోనా పాజిటివ్ అంటూ వచ్చిన సమాచారాన్ని జిల్లా వైద్యాధికారి కొట్టి పారేశారు. కరోనా పరీక్షలు నిర్వహించేందుకు కిట్‌లు లేనపుడు ఎలా నిర్ధారణ అవుతుందన్నారు. జిల్లాలో ఎలాంటి కరోనా కేసులు లేవు, ప్రజలు భయపడాల్సిన అవసరంలేదు. చాగలమర్రిలో వృద్ధురాలి నివాస పరిస రాలను వైద్య బృందం పూర్తిగా పరిశీలించారు. వృద్ధురాలి కుటుంబంలో ఆరుగురు సభ్యులకు ఎలాంటి కరోనా లక్షణాలు లేవని నిర్ధారించారు.

- డా.వెంకటరమణ, డీఎంహెచ్‌వో, నంద్యాల

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- కేసుల దర్యాప్తుపై డీఎస్పీలు దృష్టిసారించాలి
- సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించాలి
- నేర సమీక్షలో ఎస్పీ విక్రాంత్ పాటిల్



పాల్గొన్న పోలీసు అధికారులు, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

కర్నూలు క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసులపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తులపై డీఎస్పీలు దృష్టి సారించాలన్నారు. నేరాల నివారణే ప్రథమ కర్తవ్యంగా పనిచేయాలన్నారు. డాబాల్లో మద్యం, ఓపెన్ డ్రింకింగ్, పేకాట వంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే స్పెషల్ టీమ్స్ రంగంలోకి దిగి దాడులు చేస్తాయన్నారు. పెండింగ్ కేసులు తగ్గించాలన్నారు. మెజిస్ట్రేట్‌లను కలిసి పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పెండింగ్ కేసుల్లో నిందితుల అరెస్టు గురించి ఆరాతీసి శిక్షలు పడేలా చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల దర్యాప్తుల పై డీఎస్పీ స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా హైవే పెట్రోలింగ్ పోలీసులు బాగా పని చేయాలన్నారు. పోలీసు అధికారులు గ్రామాల పర్యటనకు వెళ్లినప్పుడు రోడ్డు ప్రమాదాల మలుపులు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రేడియం స్టిక్కర్లు, బారికేడ్లు, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లు, మిస్సింగ్ కేసులను ఛేదించాలన్నారు. అనంతరం గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఎస్పీలు బాబు ప్రసాద్, ఉపేంద్రబాబు, హేమలత, ఏఆర్‌డీ ఎస్పీ బాస్కర్‌రావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి: జేసీ



ర్యాలీలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ నవ్య, అధికారులు

కర్నూలు కలెక్టరేట్, మే 23(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. శుక్రవారం జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ సెంటర్ వరకు నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీని జాయింట్ కలెక్టర్ నవ్య ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న ప్రజలందరూ పాల్గొన్నాలని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ఇంకా ఒక నెల ఉందని, ఈ నెల రోజులు యోగా గురించి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. జూన్ 21న విశాఖపట్నంలో మెగా ఈవెంట్ జరుగుతుందని, దీనికి కొనసాగింపుగా రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగా కార్యక్రమంలో పాల్గొనాలనే లక్ష్యంతో ఈ క్యాంపె యిన్‌ను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో వినియో గదారుల కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్ కుమార్, డీఎస్‌వో రాజా రఘువీర్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డీఎస్‌డీవో భూపతి రావు, డీఏవో డా.శ్రీనివాసులు పాల్గొన్నారు.

హాస్టల్ మంజూరు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 23(ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేట్ గెస్టు హౌస్‌లో బీసీ స్టడీ సర్కిల్‌కు హాస్టల్‌ను మంజూరు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణను టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అలాగే జిల్లాలోని బీసీ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. వివిధ బీసీ కులాలకు సంబంధించిన కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని, నంద్యాల, కర్నూలులో జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి పత్రం సమర్పించిన వారిలో ఎంబీసీ సం క్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శివన్న, అఖిల భారత బెస్త మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు పీజీ వెంకటేశ్ ఉన్నారు. అంతకుముందు స్టేట్ గెస్టుహౌస్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణను కలెక్టర్ రంజిత్ బాషా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నీటి పన్ను వసూలు వేగవంతం చేయండి

కర్నూలు రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో నీటి పన్ను వసూలు వేగవంతం చేయాలని కర్నూలు రూరల్ మండల తహసీల్దార్ టి.వెంకటరమేష్‌బాబు సంబంధిత వీఆర్వోలను ఆదేశిం చారు. శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ తన చాంబర్‌లో రూరల్ మండలంలోని అన్ని గ్రామాల వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైన ప్రభుత్వం ద్వారా నిర్మించుకునే ఇళ్లకు ఆ గ్రామ సచివాల యంలో ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకునే విధంగా ప్రజలకు తెలియజేయా లన్నారు. గ్రామాల్లో కొంతమంది ప్రజలు ప్రభుత్వ స్థలంలో 2019 సెప్టెంబరు నెలలోపు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నట్లైతే అలాంటి వాటికి తహసీల్దార్ ద్వారా పట్టాను క్రమబద్ధీకరించాలని వీఆర్వోలకు ఆదేశించారు. ఇక నుంచి వచ్చే నెల ఒకటవ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాలలో చౌకదుకాణంలోనే రేషన్ బియ్యం తీసుకోవాలని, అందుకు ముందస్తుగా రేషన్ డీలర్లు దుకాణా లను సిద్ధంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదివరకు పీడీఎస్ వాహనాల ద్వారా రేషన్‌లను పంపిణీ చేసేవారని జూన్ నెల నుంచి ఆ వాహనాలను రద్దు చేసి, డీలర్లు ఏర్పాటు చేసిన చౌకదుకాణం వద్దనే రేషన్ తీసుకునే విధంగా ప్రభుత్వం ఆదేశించినట్లు తహసీల్దార్ వివరించారు. ప్రతి చౌకదుకాణంలో ఉదయం 7గంటల నుంచి ప్రారం భించి రాత్రి 8గంటల వరకు రేషన్ పంపిణీ చేసేలా వీఆర్వోలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్పందనలో ప్రజలు నుంచి వచ్చిన అర్జీలన్నింటిని పెండింగ్ లేకుండా పరిష్కరించాలని తహసీల్దార్ వీఆర్వోలకు ఆదేశించారు.

డీలర్లలే బియ్యం పంపిణీ చేయాలి: తహసీల్దార్

సి.బెళగల్, మే 23(ఆంధ్రజ్యోతి): జూన్ నెల నుంచి డీలర్లలే బియ్యం పంపిణీ చేయాలని మండల ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన గ్రామాల్లోని డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన ఎండీలను తొలగించి పాత పద్ధతిలోనే బియ్యం పంపిణీ చేయాలని డీలర్లకు ఆదేశించారు. ఈసమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల డీలర్లు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): జూన్ 2న మండల కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కె.రామాంజనేయులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన సూపర్-6 హామీలను అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర సమితి పిలుపు మేకు అన్ని రెవెన్యూ మండలాల కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న రాష్ట్రంలో నేటికీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు.

ప్రాణాపాయం నుంచి బతికించారు

14 ఏళ్ల బాలికకు ప్రాణం పోసిన వైద్యులు

కర్నూలు హాస్పిటల్, మే 23(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుంతకల్లుకి చెందిన 14 ఏళ్ల బాలికకు బహుళ అవయవాలు విఫలమై తీవ్ర ప్రాణాపాయంలోకి వెళ్లింది. బాలిక బతికే అవకాశాలు కేవలం 15 శాతం మాత్రమే మిగిలాయి. అలాంటి కేసును కర్నూలు కిమ్స్ కడల్స్‌కి చెందిన సీనియర్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డా.నవీన్‌రెడ్డి బృందం అత్యంత నైపుణ్యంతో వైద్యంచేసి బాలిక ప్రాణాన్ని కాపాడారు. ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికకు ముందుగా జ్వరం, దగ్గు, కడుపునొప్పి మొదలయ్యాయి. స్థానికంగా ఉండే ఆసుపత్రిలో చూపించగా కర్నూలుకు వెళ్లాలని వైద్యులు రెఫర్ చేశారు. దీంతో బాలికకు కిమ్స్ కడల్స్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. బాలికకు 60/30బీపీ ఉండటంతో గుండె పనితీరు 15శాతంగా నమోదైంది. కాలేయం కిడ్నీలు దెబ్బతిన్నాయి. దీంతో బాలికకు మల్టిరిరాన్ డిస్‌ఫంక్షన్ సిండ్రోమ్ ఇన్‌ఫెక్షన్‌తో సమస్యలు ఉన్నట్లు డా.నవీన్‌కుమార్ గుర్తించారు. ముందుగా బాలికను వెంటి లేటర్‌పై ఉంచి డయాలసిస్ చేసి కంటి న్యూవస్ కిడ్నీ రిప్లేస్‌మెంటుథెరపి ప్రారంభించారు. 72 గంటల తర్వాత పరిస్థితి మెరుగుపడింది. డయాలసిస్ చేస్తూ ఐసీయూలో ఉంచి చికిత్సతో కోలుకున్న తర్వాత వెంటిలేటర్‌ను తొలగించారు. దీంతో బాలిక పూర్తిస్థాయిలో కోలుకుందని డాక్టర్ నవీన్ రెడ్డి తెలిపారు.

పరుగులు పెట్టని పురోగతి..!

- పలు కాలనీల్లో శిలాఫలకాలకే పరిమితమైన రోడ్లు, డ్రైనేజీలు
- బిల్లులు రావనే భయంతో ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు
- రూ.12.30 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు, మే 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థ వార్షిక ఆదాయం రూ.200 కోట్లుపైమాటే. ఆ స్థాయిలో ప్రగతి పనులు పరుగులు పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలో 52 వార్డులు ఉంటే.. కర్నూలు నియోజకవర్గంలో 32, పాణ్యం నియోజకవర్గం పరిధిలో 16, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో 4 వార్డులు (డివిజన్లు ఉన్నాయి. మూడు నెలలకు ఒకసారి జరిగే నగరపాలక సర్వసభ్య సమావేశంలో ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కౌన్సిల్ ఆమోదం తీసుకుంటారు. ఆతరువాత టెక్నికల్, పరిపాలన ఆమోదం తీసుకొని టెండర్లు పిలుస్తారు. అయితే.. కాంట్రాక్టర్లు పోటీ పడి భారీ తక్కువ ధరకు టెండర్లు వేస్తున్నారు. ఆ తరువాత నష్టం వస్తుందని పనులు మొదలు పెట్టడంతో తీవ్ర జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అందేకాదు.. కాంట్రాక్టర్ల మధ్య రాజకీయ గ్రూపులు ఉండడం కూడా పనులు జాప్యానికి కారణం అవుతుంది. మరో పక్క బిల్లులు సకాలంలో చెల్లించడం లేదని, పనులు చేసి వడ్డీలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందని, పనులు చేయడానికి పలువురు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. దీంతో టెండర్లు పూర్తయినా పనులు మొదలు పెట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాదు.. సగం పనులు చేసి మధ్యలో ఆపేస్తుండంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. 27వ వార్డులో రూ.49.90 లక్షలతో కల్వర్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. కాలువ పనులు మధ్యలో ఆగిపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ప్రజలు పడిని అవస్థలు ఎన్నో. ఇదే ఒక్కటే కాదు.. దాదాపు నగరంలో 8-9 పనులకు శిలాఫలకాలు వేసి పనులు చేయకుండా ఆపేశారు. మంత్రి టీజీ భరత్ రెండు రోజుల క్రితం కాంట్రాక్టర్లతో సమావేశమై.. టెండర్లు వేసి పనులు మొదలు పెట్టకపోతే సదరు కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో పెడుతామని ఘాటుగా హెచ్చరించారు. దీంతో ఇప్పుడిప్పుడు పనులు మొదలు పెడుతున్నారు. చేస్తున్న పనుల్లో నాణ్యతాప్రమాణాలు నీటిపాలు అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల రైల్వేస్టేషన్ రోడ్డు ఐదు రోడ్ల జంక్షన్ నుంచి బంగారుపేట రోడ్డులో డ్రైనేజీ, కల్వర్లు పనులు చేపట్టారు. ఆ పనుల్లో సిమెంట్ పొదుపుగా వాడడంతో రోజులు గడవకనే సిమెంట్ ప్లాస్టింగ్ పెచ్చులు ఊడిపోతున్నాయి. రోడ్డు ఎత్తుకు సీసీ డ్రైనేజీ నిర్మించలేదు. దీంతో సీసీ డ్రైనేజీపైనే సిమెంట్ ఇటుకలతో గోడ నిర్మించాల్సి వచ్చింది. ఈ ఇటుకలు నాణ్యతగా లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగరంలో పలు కాలనీల్లో ఇదే పరిస్థితి ఉంది.



నెలలు గడవకనే ఊడిపోతున్న సిమెంట్ ప్లాస్టింగ్ పెచ్చులు

గడువులోగా పూర్తయ్యేనా?

మంత్రి టీజీ భరత్ నగరంలో 13 వార్డుల్లో జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం, ఎస్.క్యాట్ నిధులు రూ.12.30 కోట్లతో చేపట్టే 8 సీసీ రోడ్ల నిర్మాణాలు, 4 సీసీ డ్రైనేజీలు, బళ్లారి చౌరస్తా సమీపంలో జాతీయ రహదారి నుంచి ఎస్‌ఏపీ క్యాంప్ మీదుగా కొత్తబస్టాండ్ వరకు కనెక్టివిటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. మంత్రి సుడిగాలి పర్యటన చేస్తూ ఎక్కడికక్కడే శిలాఫలకాలు వేశారు. మంత్రితో పాటు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, ఎస్ఈ శేషసాయి తదితరులు ఉన్నాయి. ఈ పనులైనా కాంట్రాక్టర్లు గడువులోగా పూర్తి చేస్తారా..? బిల్లులు రావలేదనో.. ఇసుక దొరకడం లేదనో.. ఇంజనీర్లు సహకరించడం లేదనో.. మరే ఇతర కారణంగానో పనులు మొదలు పెట్టకుండా జాప్యం చేస్తారా..? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదే నియోజకవర్గానికి ఎమ్మెల్యే అయిన మంత్రి టీజీ భరత్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పాటు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. అదే క్రమంలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



రైల్వేస్టేషన్ రోడ్ ఐదు రోడ్ల జంక్షన్ నుంచి బంగారుపేట రోడ్డులో సీసీ డ్రైనేజీ నిర్మాణం తీరు

గడువులోగా పనులు పూర్తి చేస్తాం

మంత్రి టీజీ భరత్ ఎంతో ప్రతిష్టాత్మకంగా రూ.12.30 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు. గడువులోగా పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశించారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఒప్పందం గడువులోగా పూర్తి చేస్తాం. నాణ్యత విషయంలో రాజీ పడేప్రసక్తి లేదు.

- శేషసాయి, ఇన్‌చార్జి ఎస్ఈ, నగరపాలక సంస్థ, కర్నూలు

అసంక్రమిత వ్యాధులను అరికట్టాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, మే 23(ఆంధ్రజ్యోతి): అసంక్రమిత వ్యాధులను అరికట్టాలని, అందుకు ఎన్‌సీడీ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ అన్నారు. శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శశికళ మాట్లాడుతూ శారీరక వ్యాయామం లేకుండా ఒకే చోట కూర్చుని పని చేస్తే ఆరోగ్యం పాడవుతుందని, జీవన ఆహార శైలిలో వచ్చిన మార్పులతో ఎక్కువ మంది అనారోగ్యం బారిన పడుతున్నారని హెచ్చరించారు. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్‌తోపాటు ఇతర వ్యాధులను ప్రారంభంలోనే గుర్తించాలన్నారు. ఆహారంలో ఉప్పు తగ్గించుకోవాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తినకూడదని తెలిపారు. కార్యాలయ ఉద్యోగులు, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని, తీవ్ర ఒత్తిడిని తట్టుకునేలా యోగా, వ్యాయామం చేయాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారికి బీపీ, మధుమేహం పరీక్షలు తప్పక చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శైలేష్ కుమార్, సంచార చికిత్స కార్యక్ర మం నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు, డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో కే.అరుణ, డెమో శ్రీనివాసులు శెట్టి, ఆర్‌బీఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, సత్యనారాయణ పాల్గొన్నారు.

నన్నూరులో శిలాఫలకం ధ్వంసం



ధ్వంసమైన శిలాఫలకం

ఓర్వకల్లు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం తెల్లవారుజామున ధ్వంసం చేశారు. ఈ ఏడాది మార్చి 14న రూ.5లక్షల నిధులతో అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి వంక వరకు సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గౌరు చరిత భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తమ ప్రభుత్వంలోనే మా శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం ఏమిటని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూడిచర్ల బస్టాండు సమీపాన కొండపై వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందుకే గుర్తు తెలియని వారు ఈ శిలాఫలా కాన్ని ధ్వంసం చేసి ఉంటారని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ఈ శిలాఫ లకాన్ని గుర్తు తెలియని వారు ధ్వంసం చేశారా? వాహనంతో ప్రమా దవశాత్తు ఢీకొట్టారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేయాల్సి ఉంది.

యోగాను జయప్రదం చేయండి



రాతివనంలో యోగా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సందీప్‌కుమార్

ఓర్వకల్లు, మే 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న చేపట్టే యోగాను జయప్రదం చేయాలని కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఓర్వకల్లు గ్రామ సమీపాన ఉన్న పున్నమి రెస్టారెంటు సమీపంలో 26న యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏర్పాట్లను కర్నూలు ఆర్డీవో, అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఈ నెల 26న యోగా కార్యక్ర మంలో భాగంగా వేయి మంది యోగా వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సచివాలయ అధికా రులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థులు, ఉపాధ్యా యులు హాజరు కావాలన్నారు. ముఖ్యఅతిథులుగా ఏపీ టూరిజం కమి షనర్ అజయ్‌జైన్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఏపీ టూరిజం అధికారులు విజయ లక్ష్మీనారాయణ, జీవన్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్డీ సుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వీఆర్వో స్వామన్న, టూరిజం సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

సి.బెళగల్, మే 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ యోగాపై అవగాహన అవసరమని యోగా గురువు సోమేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాణెమ్మ అధ్యక్షతన అధికారులకు యోగాపై గురువు సోమేశ్వరరెడ్డి అవగాహన కల్పించారు. మండల ప్రత్యేక అధికారి రఘునాథ్‌బాబు మాట్లాడుతూ మండలం లో పనిచేస్తున్న అన్ని శాఖ వారు యోగాను నేర్చుకోవాలనే తపన ఉన్న వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కేఈ మాదన్న వర్ధంతి



జ్యోతి ప్రజల్వన చేస్తున్న ఎంపీ నాగరాజు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

కర్నూలు కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే కేఈ మాదన్న 32వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ బస్తిపాటి నాగరాజు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కేడీసీసీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్‌గౌడ్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన వ్యక్తిగా కేఈ మాదన్న నిలిచిపోతారని శ్లాఘించారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ తనతండ్రి వారసత్వంలో 9 ఏళ్ల ఏకధాటిగా మంత్రిగా రాష్ట్రానికి సేవలు అందించానని చెప్పారు. అనంతరం మాదన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనం తరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భం గా కళాకారులను, నృత్య ప్రదర్శకులను, గాయకులను మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, ఎంపీ బస్తిపాటి నాగరాజు శాలువలతో సత్కరించారు. ఈ సభకు కేడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహించగా, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్‌గౌడ్, రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ప్రసంగించారు. ఇందులో భాగంగా సీనియర్ రంగస్థల నటుడు పి. దస్తగిరి ఆలపించిన రంగస్థల పద్యాలు, నాట్య గురువు కరీముల్లా శిష్యబృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చివరగా సంగా ఆంజనేయులు దర్శ కత్వంలో, నటులు చల్లా నవీన్‌కుమార్ నాయుడు, సంగా ఆంజనే యులు, భాస్కర్, మహమ్మద్ మియా తదితరులతో ప్రదర్శించిన 'బావా ఎప్పుడు వచ్చితివి' సాంఘిక హాస్య నాటిక అసాంతం ప్రక్షకులను అలరింపజేసింది.

'వేగం' పెయింటర్స్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు రూరల్ మే 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో శుక్రవారం క్రెడాయ్ ప్రాపర్టీ షో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొని క్రెడాయ్ ప్రాపర్టీ షోను ప్రారంభించారు. ఇందులో భాగంగా పెద్దటేకూరు శివారులో ఏర్పాటు చేసిన వేగం పెయింటర్స్ పరిశ్రమకు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి, మేయర్ బీవై.రామయ్య, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రవీంద్రబాబు, క్రెడాయ్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్‌రెడ్డి, ఛైర్మన్ గోరంట్ల రమణ, కన్వీనర్ ఎన్ శ్రీనివాసరావు, వేగం పెయింటర్స్ అధినేత కేఈ పినాకపాణిగౌడ్ పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్‌పై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మే 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నేషనల్ హెల్త్ మిషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు హాస్పిటల్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల్లో ఉన్న ఎస్ఎన్‌సీయూ, డైస్‌లో పనీ చేస్తున్న వైద్యులు, సిబ్బందికి సంబంధిత జీతాలకు సంబంధించిన బిల్లులను సీఎస్ఆర్ఎంవో, పీడీయాట్రిక్ హెచ్‌వోడీ ధృవీకరించిన తర్వాతనే డీఎంహెచ్‌వో ఆఫీసుకు బిల్ ప్రాసెస్‌చేయాలని సూపరింటెండెంట్ ఆదేశించారు. చిన్న పిల్లల విభాగంలో మరింతగా సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డా.వెంకటేశ్వరరావు, పీడీయాట్రిక్ హెచ్‌వోడీ డా.విజయానందబాబు, పీడీయాట్రిక్ వైద్యులు డా.రవీంద్రనాథ్, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకోని వారి పేర్లను రద్దు చేయండి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

సి.బెళగల్, మే 23(ఆంధ్రజ్యోతి): ఇళ్లు నిర్మించుకోని వారి పేర్లను రద్దు చేయాలని హౌసింగ్ పీడీ చిరంజీవి ఏఈ సుమంత్‌కు ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాణెమ్మ అధ్యక్షతన మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు హాజరయ్యారు. ఈసందర్భంగా పీడీ చిరంజీవి మాట్లాడుతూ మండలానికి గతంలో మంజూరైన 211 గృహాలలో 98 పూర్తి చేశారని, మిగతా వాటిని కూడా జూన్ ఆఖరిలోగా పూర్తి చేయాలని అన్నారు. ఈసమావేశంలో తహసీల్దార్ పురుషోత్తం, మండల ప్రత్యేక అధికారి రఘునాథ్‌బాబు, ఈఈ ప్రభాకర్, ఏఈ సుమంత్ పాల్గొన్నారు.

ఏడాదిగా అవమానాలు ఎదుర్కొన్నాం

కోడుమూరు టీడీపీ నాయకుల ఆవేదన



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కోడుమూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలం వస్తున్నా నాటి నుంచి నేటి వరకు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నామని ఆ పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి సీబీ లత నివాసంలో శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీబీ లత, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. ఇటీవల జరిగిన నియోజకవర్గ, జిల్లా స్థాయి మహానాడు వేడుకకు ఆహ్వానం లేదన్నారు. ఎన్నికల ముందు అధినేత చంద్రబాబు సూచన మేరకు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, ఎంపీ విజయం కోసం రేయింబవళ్ల శ్రమించామని తెలిపారు. కలిసికట్టుగా కృషిచేయడంతో పట్టణం లో దాదాపు 3వేల పైచిలుకు మెజార్టీ టీడీపీకి దక్కిందని అన్నారు. తీరా అధికారం చేపట్టాక కోట్ల వర్గమంటూ పక్కనబెట్టడం ఎంతవరకు సబబని, కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి టీడీపీ కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన ఒకరికి స్కూల్ కమిటీ ఛైర్మన్ పదవి కట్టబెట్టారని తెలిపారు. ఐదేళ్లు కష్టపడిన నిజమైన కార్యకర్తలకు ఏమి సమాధానం చెబుతారని మండిపడ్డారు. సమావేశంలో సర్పంచ్ భాగ్యరత్నమ్మ, మండల కన్వీనర్ కోట్ల కవి తమ్మ, మాజీ సర్పంచ్ రాంబాబు గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల వినూత్న నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

గూడూరు, మే 23(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించే వరకు నిరసన కొనసాగుతుందని మున్సిపల్ ఇంజనీర్ కార్మికులు అన్నారు. శుక్రవారం గూడూరులోని పాత బస్టాండ్‌లో మున్సిపల్ కళ్లకు గంతలు కట్టుకుని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికులు మాట్లాడుతూ టెక్నికల్, నాన్ టెక్ని కల్ జీతం రూ.29,200, రూ.24,500 ఇవ్వాలని, 15 సంవత్సరాలు పైబ డిన వారిని పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహనలో చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆరవింద్, దూకేశ్వర రావు, బసవరాజు, మధు, అంజనేయులు, పఠాన్, షబ్బీర్, హరి, జయన్న. ఖాజాహుసేన్ పాల్గొన్నారు.

బీచ్ సెపక్‌తక్రాలో రాష్ట్రానికి కాంస్యం

కర్నూలు స్పోర్ట్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలితమైన డ్యూలో జరుగుతున్న ఖేలో ఇండియా బీచ్ పోటీల్లో భాగంగా మహిళా సెపక్ తక్రా డబుల్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ బాలికలు ప్రత్యర్థులపై వరుసగా విజయాలు సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారని రాష్ట్ర సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు తెలిపారు. తొలి రౌండులో డ్యూ గుజరాత్‌పై 2-0 స్కోరుతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌లోకి చేరుకుంది. ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో వరుసగా రెండు పాయింట్లను సాధించి 2-0 స్కోరుతో ఢిల్లీపై విజయం సాధించింది. ఒరిస్సా జట్టుపై ఏపీ జట్టు మధ్య జరిగిన సెమీస్‌లో మహిళలు గట్టి పోటీనిచ్చి పరాజయం పొందారు.

ఆస్తి పన్నులపై సర్వే చేయండి

● సిబ్బందిని ఆదేశించిన మున్సిపల్ కమిషనర్ కృష్ణ


సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్

ఆదోని టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవనాలు, ఆస్తి పన్నులపై సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఆదేశించారు. శుక్రవారం మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పాత ఇళ్లకు తక్కువ పన్ను ఉన్నా, నూతన భవనాలకు పన్ను విధించకపోయినా గుర్తించి పన్నులను విధించాలని ఆదేశించారు. మునిసిపాలిటీ ఆదాయం పెరిగితే అభివృద్ధి పనులు చేసేందుకు 1వకాశం ఉంటుందన్నారు. సమావేశంలో రెవెన్యూ ఆఫీసర్ నిసార్ అహ్మద్, ఆర్ఐలు, నోడల్ ఆఫీసర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రతిభా పురస్కారాల ప్రదానం

ఆదోని అగ్రికల్చర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని మహర్షి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు వాల్మీకి ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు తెలిపారు.


మాట్లాడుతున్న సుధాకర్ బాబు

శుక్రవారం మాట్లాడుతూ శనివారం సాయంత్రం లోపు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ మునిసి పల్ పాఠశాలల విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచిం చారు. 7013682489, 9640718346 నంబర్లను సంప్రదించా లన్నా రు. నరసయ్య, రమేష్ నాయుడు, సత్యన, భీమరాజు పాల్గొన్నారు.

మీనాక్షి నాయుడి వివాహ వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న మీనాక్షి నాయుడు దంపతులు

ఆదోని, మే23(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు, సులోచనమ్మ దంపతుల 52వ వివాహ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్వగృహంలో తెలుగు యువత కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. నియోజకవర్గ కార్యకర్తలు మీనాక్షి నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మదిరే వీరేష్, దొడ్డనగిరి వీరేంద్ర, అయ్యన్న, ధనాసింగ్, ఈరన్న యాదవ్, వెంకట్రావు, రాము గౌడ్, శ్రీకృష్ణ యాదవ్, పరశురాముడు, అయ్యన్న, శంకర్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యాన్ని అడ్డుకోండి

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ

ఆలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం రవాణాను అడ్డుకోవాలని నిఘా పెంచాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశించారు. గురువారం రాత్రి హాలహర్వి మంలం క్షేత్రగుడి చెక్ పోస్టును తనిఖీ చేసి, సీసీ కెమెరాలను పరిశీలించారు.


మాట్లాడుతున్న డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ

అనంతరం ఆలూరు ఎక్సైజ్ స్టేషన్‌లో మాట్లాడుతూ నవోదయం 2.0లో భాగంగా సారాను నిర్మూలించాలన్నారు. డి.సి. శ్రీదేవి, ఎ.సి.హనుమంతరావు, సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణ, సీఐ లలిత ఉన్నారు.

పనిచేసిన కార్యకర్తలకు పదవులు

తుగ్గలి, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి పార్టీ అని, పార్టీ అభివృద్ధికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి పదవులు ఇస్తామని ట్రైబల్ సలహా మండలి సభ్యుడు వెంకటపతి అన్నారు. శుక్రవారం కంబాలపాడులో మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తిని సన్మానించి, ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.


కేఈని సన్మానిస్తున్న వెంకటపతి

కేఈ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, కార్యకర్తలందరికీ న్యాయం చేస్తారన్నారు. తాను ఉపముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 68చెరువులకు హంద్రీనీవా ద్వారా చెరువులను నింపేందుకు దాదాపు రూ.250కోట్లు మంజూరు చేయించామని, వైసీపీ వచ్చాక ఆగిపోయిందన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు సారథ్యంలో చెరువులన్నింటికి నీరు మళ్లిస్తున్నామన్నారు. తెలుగు యువత నాయకుడు బత్తిన లోకనాద్, ఆర్యవైశ్య సంఘం నాయకులు చెక్క గోపాల్ ఉన్నారు.

ఎన్‌కౌంటర్‌పై విచారణ చేయాలి

పత్తికొండ టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

న్యాయ విచారణ చేయాలని సీపీఐ కార్యదర్శి రాజాసాహెబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ నంబాల ఎన్‌కౌంటర్‌పై సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రామాంజనేయులు, సహాయ కార్యదర్శి రంగన్న పాల్గొన్నారు.

నీటితొట్లను శుభ్రం చేసుకోవాలి

మద్దికెర, మే 23 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల బారిన పడకుండా నీటి తొట్లను వారానికోసారి శుభ్రం చేయాలని హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, ఏఎన్ఎం గాయత్రి సూచించారు. శుక్రవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో ట్యాంకులు, నీటితొట్లు, డ్రమ్ములు, బిందెను శుభ్రం చేయించారు. అలాగే ట్యాంకులను పరిశీలించారు. వర్షాలు కురుస్తుండటంతో నీరు కలుషితమై సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రజలు జాగ్రత్త వహించాలని సూచించారు.

● తీరనున్న ఉపాధ్యాయుల కొరత ● ఆదోని పరిధిలో 115 పోస్టులు ● పదోన్నతి ద్వారా హెచ్‌ఎంల నియామకం

పుర పాఠశాలలకు మహార్దశ!


ఆదోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల

ఆదోని అగ్రికల్చర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పురపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించేందుకు ఆమోదం తెలపడంతో సబ్జెక్టు టీచర్ల కొరత తీరనుంది. కొన్నేళ్లుగా ఉన్న ఉపాధ్యాయుల కొరత ఇబ్బంది తీరనుంది. పదో తరగతి ఫలితాల్లో మున్సిపల్ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడుతున్నాయి. ఇప్పటిదాకా ఇన్‌చార్జి హెచ్‌ఎంలతో నెట్టుకొస్తున్న పాఠశాలలకు పూర్తిస్థాయిలో హెచ్‌ఎంలు రానున్నారు. మునిసిపల్ పాఠశాలల్లో గత 17 ఏళ్లుగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదోని మున్సిపల్ పాఠశాలలు 39, నంద్యాల మున్సిపాలిటీలో 39 పాఠశాలలు ఉండగా కర్నూలు కార్పొరేషన్ 52 పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

పోస్టులు మంజూరు హర్షణీయం



17 ఏళ్ల తర్వాత ఉపాధ్యాయ పోస్టుల మంజూరుతో పాటు పదోన్నతి కల్పించడం హర్షణీయం. పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు ఇది తోడ్పడనుంది. విద్యాశాఖ మంత్రి లోకేష్ చొరవ తీసుకుని మునిసిపల్ పాఠశాలల్లో పదోన్నతులు కల్పించడం అభినందనీయం. - వి రమేష్ నాయుడు, ఎస్టీయూ పురపాలక కమిటీ సభ్యుడు ఆదోని

బదిలీల అనంతరం పదోన్నతులు



ఉమ్మడి జిల్లాలోని అన్ని పురపాలక పాఠశాలలకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించేందుకు ఆమోదం తెలిపింది. ఎస్జీటీలకు పదోన్నతి కల్పించి హైస్కూళ్లలో ఉన్న సబ్జెక్టు టీచర్ల కొరత తీరుస్తాయి. బదిలీలు పూర్తయిన వెంటనే పదోన్నతి కల్పిస్తాం. పూర్తిస్థాయిలో హెచ్‌ఎంలను నియమిస్తాం. - ఎస్.శామ్యూల్ పాల్, డీఈవో, కర్నూలు

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అనుమతి

రాష్ట్ర ప్రభుత్వం పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చింది. దీంతో అవసరమైన చోట ఉపాధ్యాయుల కు పదోన్నతులు కల్పించి పూర్తి స్థాయిలో నియమించుకునేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. గ్రేడ్ టూ హెచ్‌ఎం పోస్టులు కూడా భర్తీ కానున్నాయి. ఆదోని, మునిసిపాలిటీ పరిధిలో 115 పోస్టులు భర్తీ కానున్నాయి. అలాగే అవసరమున్న ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. బదిలీల అనంతరం వారంలో షెడ్యూల్ ద్వారా ఈ కార్యక్ర మాన్ని నిర్వహిం చేందుకు విద్యాశాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

విద్యా వలంటీర్లతో

సబ్జెక్టు టీచర్ల కొరత ఉండటంతో విద్యా వలంటీర్లు లేకుంటే ఇతర పాఠశాలల నుంచి ఎస్జీటీలను డిప్యూటేషన్‌పై నియమించి విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. పూర్తిస్థాయి హెచ్‌ఎంలు, పీఈటీలులేఏక ఇబ్బంది పడుతున్నారు.

అప్‌గ్రేడ్ పాఠశాలకు హెచ్‌ఎంలు

పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యి ఆరేళ్లవుతోంది. దాదాపు 700 మంది విద్యార్థులు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. ఇక్కడ కేవలం నలుగురితో మాత్రమే నెట్టుకొస్తున్నారు. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయుడు కూడా రానున్నారు. కిల్చిన్ పేట పురపాలక ఉన్నత పాఠశాల, ఆస్మియా ఉర్దూ ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంలు రానున్నారు. నంద్యాలలోని వైఎస్సార్ కాలనీలో పురపాలక ఉన్నత పాఠశాల, నడిగట్టు మసూదియా ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎం పోస్టులు మంజూరయ్యాయి. దీంతో ప్రధానాపోధ్యాయులతో పాటు సబ్జెక్టు టీచర్ల కొరత కూడా ఇక ఉండదు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


వినతులు స్వీకరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, మే23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ ఆలూరు ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. శుక్రవారం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులను పరిశీలించి సంబంధిత అధికారులకు పంపుతామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సారధ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారన్నారు.

త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం అమలు అవుతాయన్నారు. కార్యక్రమంలో ఏబీసీడీ చైర్మన్ నగరడోణ కిష్టప్ప, యువనేత గిరిమల్లేష్‌గౌడ్, మండల కన్వీనర్ అశోక్‌యాదవ్, సర్పంచ్ భాస్కర్, టీడీపీ నాయకులు నరసప్ప, గుమ్మనూరు అంపయ్య, మల్లికార్జున, రాముయాదవ్, గుండయ్య, వన్నూరువల్లి, కిట్టు, కేశన్న, హనుమప్ప పాల్గొన్నారు.

బాలికలు విద్యలో రాణించాలి


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

వెల్దుర్తి, మే 23 (ఆంధ్ర జ్యోతి): బాలికలు విద్యలో రాణించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరస్వతి సూచించారు. శుక్రవారం మండలంలో బింగి దొడ్డి గ్రామం అంగన్వాడీ కేం ద్రంలో కిశోరి వికాసం నిర్వహించారు. సమాజంలో ఎలా రాణించాలలో, భవిష్యత్తు అవసరాలపై బాలికలకు ఆమె దిశానిర్దేశం చేశారు. ఏఎన్ఎమ్ నాగమణి, అంగన్వాడీ సుకన్య పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎంను కలిసిన బత్తిని లోక్‌నాథ్


కేఈ కృష్ణమూర్తితో బత్తిని లోక్‌నాథ్

పత్తికొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువత అధికార ప్రతినిధి బత్తిని లోక్‌నాథ్, ట్రైబల్ కమిషన్ సభ్యుడు వెంకటపతి శుక్రవారం మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తిని కలిశారు. బత్తిని లోక్‌నాథ్ జన్మదినం సందర్భంగా కృష్ణమూర్తి, పద్మావతమ్మ ఆశీస్సులు తీసుకున్నారు.

ఘనంగా కేఈ మాదన్న వర్ధంతి


సమాధికి నివాళి అర్పిస్తున్న కేఈ

క్రిష్ణగిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ దివంగత కేఈ మాదన్న 31వ వర్ధంతిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కంబాలపాడులో మాదన్న సమాధి వద్ద మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, పద్మావతమ్మ దంపతులు, మాజీ ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ కేఈ జయన్న నివాళి అర్పించారు.

ముగిసిన భజన పోటీలు

తుగ్గలి, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ శివారులో వెలసిన కృష్ణాపురం ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో నిర్వహించిన భజన పోటీలు ముగిశాయి. మండ్లవాని పల్లి భజన బృందం మొదటిస్థానంలో నిలిచిందని పూజారి వడ్ల ప్రహ్లాద్ తెలిపారు. శంకర్ రెడ్డి, వెంకటేశ్, భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలి


ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు భోజనం చేసేందుకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని క్యాంటీన్ ఏర్పాటు చేస్తే మలేన్నారు. దస్తగిరి, ప్రజా సంఘాల నాయకులు కాశన్న, రవి, రాజు పాల్గొన్నారు.

కౌలుకార్డులు పొందాలి

మద్దికెర, మే 23 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు కౌలుకార్డులు తప్పనిసరిగా పొందా లని వ్యవసాయ శాఖ అధికారి యు.రవి సూచించారు. శుక్రవారం మండలంలోని బురుజుల గ్రామం రైతు సేవా కేంద్రంలో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన కల్పించారు. కౌలుకార్డు పొందిన రైతులకు పంటనష్టం వస్తే బీమా, నష్టపరిహారం బ్యాంకుల ద్వారా రుణసదుపాయం వస్తుందన్నారు.

పార్టీ పదవికి రాజీనామా

వెల్దుర్తి, మే 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ రైతుసంఘం అధ్యక్ష పదవికి రాజీనామ చేస్తున్నట్లు గుంటుపల్లి ఈదుల వెంకటరాముడు తెలిపారు. వెల్దుర్తిలో ఈ నెల 21న నిర్వహించిన నియోజక మహానాడులో తనను వేదికపైకి పిలువకడం పోవడంతో మనస్థాపం చెందానని, 42 ఏళ్లుగా పార్టీకోసం పనిచేస్తున్న తనను గుర్తించలేదన్నారు. అయితే తాను పార్టీ కార్యకర్తగా కొనసాగుతానని తెలిపారు.

కంటైనర్ బోల్తా

వెల్దుర్తి, మే 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపాన ఈద్గా వద్ద జాతీయ రహదారి-44పై శుక్రవారం ఓ కంటైనర్ బోల్తా పడింది. వివరాల మేరకు.. బెంగళూరు నుంచి హర్యానా రాష్ట్రం అంబాలకు బ్యాటరీ స్టేషనరీ లోడుతో వెళుతున్న కంటైనర్ తెల్లవారుజామున అదుపు తప్పింది. కాగా, డ్రైవర్ ఇస్మాయిల్, క్లీనర్ అల్లావుద్దీన్ సురక్షితంగా బయటపడ్డారు. హైవే పోలీసులు కంటైనర్‌లో ఉన్న స్టేషనరీని హమాలీల సాయం తో అన్‌లోడ్ చేసిన అనంతరం క్రేన్ల సాయంతో కంటైనర్‌ను రోడ్డుపై నుంచి తొలగించారు.

కారును ఢీకొన్న లారీ

కంటైనర్‌లో బోల్తాపడటంతో మదార్‌పురం గ్రామ సమీపంలో వన్‌వే ఏర్పాటు చేశారు. ఓ లారీ కారును ఢీకొట్టింది. వివరాల మేరకు. తమిళనాడుకు వెళుతున్న లారీ ఈద్గా సమీపంలో జాతీయరహదారి-44పై ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయే క్రమంలో ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టింది. కారు ముందు భాగం ధ్వంసం కాగా, అందులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు స్వల్ప గాయాల య్యాయి. బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రాణపాయం తప్పింది.

దళితులపై దాడులను అరికట్టాలి

మద్దికెర, మే 23 (ఆంధ్రజ్యోతి): దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని రాష్ట్ర ఇరిగేషన్ మాజీ డైరెక్టర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం తహసీల్దార్ హుశేన్ సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. టీడీపీ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చాక ఎస్సీలపై


వినతి పత్రం ఇస్తున్న ఆర్.వెంకటేశ్వర్లు

దాడులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలో జేమ్స్ అనే విద్యార్థిపై దాడి చేసి సభ్యసమాజం సిగ్గుపడేలా చేశారనీ, వారిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చిప్పగిరి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు లక్ష్మీనారాయణను పట్టపగలే హత్య చేయడం దారుణమన్నారు. ఆదోని, కర్నూలు ప్రాంతాల్లో కూడా దళితులపై దాడులు జరిగాయని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దాడులపై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచంద్రరావుకు వినతి పత్రం పంపామన్నారు. గద్దల ఆంజనేయులు, మల్లికార్జున ఉన్నారు.

రేషన్ వాహనాల రద్దుపై డీలర్ల హర్షం

ఆలూరు, మే 23(ఆంధ్రజ్యోతి): డీలర్ల నుంచే రేషన్ పంపిణీ నిర్ణయం హర్షణీయమని డీలర్ల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకటేష్, రంగయ్య అన్నారు. శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్‌ను సన్మానించారు. ఎండీయూ వాహనాలను రద్దుచేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు లోకేష్, నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ధన్యవాదాలు తెలిపారు. కోశాధికారి హనుమప్ప, డీలర్లు ప్రసాద్‌రావు, వీరనాథ్, అంబన్న, రవికుమార్, మండల డీలర్లు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదతో ఆదాయం

ఆలూరు రూరల్, మే23(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టితో పంచాయతీలకు ఆదాయం వస్తుందని డీఎల్‌పీవో వీరభద్రప్ప అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ముద్దనగేరి, మొగలవల్లి ముసనహళ్ళిలో చెత్త సంపద కేంద్రాలను అందుబాటులోకి తెస్తామన్నారు. తాగునీటి సమస్య తలెత్తనివ్వమని, పంచాయతీ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈవోఆర్‌డీ వై ప్రభాకర్, కార్యదర్శులు విజయ కుమార్, రామేష్, వెంకట నాయుడు, హుల్తెప్ప, ఉరుకుంద పాల్గొన్నారు.

'కరోనా' పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ఆదోని టౌన్, మే23(ఆంధ్రజ్యోతి): కరోనా పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస ఆచారి, బాలాజీ మునిసిపల్ కమిషనర్ కృష్ణను కోరారు. ప్రజలు గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటించాలన్నారు.

డీలర్ల వద్దే రేషన్

● ఆదోని తహసీల్దార్ శివరాముడు



ఆదోని రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1నుంచి డీలర్ల నుంచే రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ శివరాముడు సూచించారు. శుక్రవారం డీలర్లతో మాట్లాడుతూ, నియోజకవర్గంలో మొత్తం 79,404 కార్డుదా రులు, 116మంది డీలర్లు ఉండగా, 59 మంది రెగ్యూలర్ డీలర్లు, 57మంది ఇంచార్జి డీలర్లన్నారు. కొత్త రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవచ్చని, కొత్త కార్డు దారులకు ఈనెల బియ్యం ఉండదన్నారు. గ్రామాలు, పట్టణాల్లో దండోరా వేయించాలన్నారు. సీఎస్‌డీసీ వలిబాషా ఉన్నారు.

పాత విధానంలో పంపిణీ

ఆలూరు, మే23(ఆంధ్రజ్యోతి): జూన్ నుంచి పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ గోవింద్‌సింగ్ సూచించారు. శుక్రవారం కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐ బసవన్నగౌడ్ పాల్గొన్నారు.

మద్దికెర: రేషన్‌కార్డుదారులకు జూన్ 1 నుంచి చౌకదుకాణాల ద్వారానే సరుకులు అందివ్వనున్నట్లు తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు.

అందరికీ పనులు కల్పించాలి


మాట్లాడుతున్న ఏపీడీ లక్ష్మన్న

మద్దికెర, మే 23 (ఆంధ్రజ్యోతి): కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీ లక్ష్మన్న సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం భవనంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మేటీల ద్వారా పనులు గుర్తించి ప్రతి కుటుంబానికి వంద రోజుల పనులు కల్పించాలని, రోజుకు రూ.300లు అందేలా చూడాలన్నారు. జాబ్‌కార్డు ఉన్నవారే పనికి వెళ్లాలని, మేటీలు డబ్బులు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలో 200 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉంచుకున్నామని, రైతులను ప్రోత్సహించాలని కోరారు. ఏపీవో నర్సిరెడ్డి, టీఏలు, పీఏలు కూలీలు ఉన్నారు.

విచారణ చేయించాలి


నినాదాలు చేస్తున్న నాయుకులు

ఆదోని అగ్రికల్చర్, మే 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్తు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయాధికారితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, డివిజన్ కార్యదర్శి వెంకప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం మాట్లాడుతూ చత్తీస్‌ఘడ్ దండకారణ్యంలో మావోయిస్టు నాయకుడితో పాటు 27 మంది ఆదివాసులను హతమార్చడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఆదివాసులు నివసిస్తున్న దండకారణ్యంలో అపార ఖనిజ నిక్షేపాలు ఉండటంతో, కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడానికే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. మణి, అఖండ, సురేష్, సౌరప్ప పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానంపై కేసులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● ఆలూరు ఎస్ఐ మహబూబ్ బాషా



ఆలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మద్యపానం నేరమని, అలా చేసేవారిపై కేసులు నమోదు చేస్తామని ఆలూరు ఎస్ఐ మహబూబ్ బాషా అన్నారు.

ప్రశ్న: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ఇప్పటివరకు ఎఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: ఎస్పీ ఆదేశాలు, ఆలూరు సీఐ సూచనల మేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 150 మందిపై కేసులు నమోదు చేశాం.

ప్రశ్న: సైబర్ నేరాలపట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తాం.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: ఆటో, లారీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ వాడాలని సూచిస్తున్నాం. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించాం.

ప్రశ్న: పేకాట, సారా నియంత్రణకు చర్యలు తీసుకున్నారా?

జవాబు: పేకాట, అక్రమ మద్యం, సారా తయారీపై నిఘా ఉంచాం. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

ప్రశ్న: ఆలూరులో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు ఏవి?

జవాబు: అరికెర రోడ్డు, అంబేడ్కర్ కూడళ్లలో ఇద్దరు కానిస్టేబుళ్లను నియమించాం. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చూస్తాం.

ప్రశ్న: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ విషయంలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు

● అంధకారంలో గ్రామాలు ● తాగునీటి పథకాలకు విద్యుత్ అంతరాయం ● మరమ్మతుల పేరుతో అధికారుల కాలయాపన


గోనెగండ్ల విద్యుత్ సబ్ స్టేషన్


నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

గోనెగండ్ల, మే 23(ఆంధ్రజ్యోతి):గ్రామాలలో ఇటీవల చిటపట చినుకులకే విద్యుత్ కోతలు తీవ్రమవుతున్నాయి. పగలు రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు అధికారులు విద్యుత్ కోత విధిస్తున్నారు. గ్రామాల్లో రెండు మూడు రోజులుగా విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక చిన్న పిల్లలు, వృద్దుల పరిస్థితి చెప్పక్కర్లేదు. మండు వేసవి కావడంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. వారం రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలుల కారణంగా గ్రామాల్లోని విద్యుత్ స్థంబాలు, పంటపోలాల్లోని స్థంబాలు నెలకొరుగుతున్నాయి. వీటి మరమ్మత్తుల్లో భాగంగా రెండు మూడు రోజులు అయినప్పటికి విద్యుత్ సరఫరా పునరుద్దరించలేదు. దీంతో తాగునీటి పథకాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో తాగునీరు సరఫరా కావడం లేదు. రెండు మూడు రోజులుగా ఈదురు గాలలు వల్ల ఐరన్‌బండ, హెచ్ కైరవాడి, నెరుడుప్పల, ఎన్నెకండ్ల, గోనెగండ్ల, అలువాల, పెద్దమరివీడు, గాజులదిన్నె, గంజహళ్లి, బైలుప్పల తదితర గ్రామాల్లో వర్షం కారణంగా దాదాపు 50 నుంచి 100 విద్యుత్ స్థంబాలు నేలకొరిగాయి. అలాగే దాదాపు 50 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోయాయి. వాటిని మరమ్మత్తు చేసే విషయంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో విద్యుత్ సిబ్బంది కూడా తక్కువ ఉన్నట్లు తెలుస్తోంది.

నేలకొరుగుతున్న విద్యుత్ స్తంభాలు:
మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షం, ఈదురు గాలుల వల్ల విద్యుత్ స్థంబాలు నెలకొరుగుతున్నాయి. గ్రామంలోని వీధుల్లో, పంట పొలాల్లో స్థంబాలను ఏర్పాటు చేసే విషయంలో అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో చిన్న పాటి గాలులకే నెల కొరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో రాత్రి పూట విద్యుత్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలనిప్రజలు కోరుతున్నారు.

● చిన్న వానకే విద్యుత్ కోతలు



చిన్నపాటి వర్షం కురిసినా అధికారులు విద్యుత్ కోతలను విధిస్తున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా కోతలు ఉన్నాయి. రాత్రి పూట చిన్న పిల్లలు, వృద్దులు చాల ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ కోత సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలి.
- శ్రీనివాసనాయుడు, గాజులదిన్నె

● తాగునీటి సమస్య తీవ్రమవుతోంది



విద్యుత్ సరఫరా లో అంతరాయ ఏర్పడటం వల్ల తాగునీటి పథకాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుంది. దీంతో గ్రామాలకు నీటి సరఫరా చేసే పథకాలు నిలిచిపోవడంతో కోళాయిలకు నీరు సరఫరా నిలిచి పోతుంది. రెండు మూడు రోజులుఅయినా నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
-కౌలుట్లయ్య నాయుడు, గోనెగండ్ల

విద్యుత్ పనులు చేపడుతున్నాము

ఈదురు గాలులు, వర్షం కారణంగా గ్రామలలో నెలకొరిగి విద్యుత్ స్థంబాలను, ట్రాన్స్‌ఫార్మర్‌లను మరమ్మత్తు చేస్తున్నాము. ఆ సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. తాగునీటి పథకాలకు విద్యుత్ కోత లేకుండా చూస్తున్నాము. ఉరుములు, మెరుపుల కారణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతింటున్నాయి. వాటి మర్మత్తు కూడా సిబ్బందితో చేస్తున్నాము. విద్యుత్ కోతలు లేకుండా చూస్తాము.
- సుధాకర్‌రావు, విద్యుత్ ఏఈ, గోనెగండ్ల

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘువేంద్రరెడ్డి


అర్జీలను స్వీకరిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి

మంత్రాలయం, మే 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నాయకులు, కార్యకర్తలు, పార్టీలకతీతంగా ప్రజలు తమ సమస్యలు తమ దృష్టికి తెస్తే న్యాయం చేసి పరిష్కరిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘువేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం తన నివాసంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ వేదికలో నాలుగు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రజావేదికలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, బొజ్జప్ప, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

భార్యపై వేధింపులు

● భర్త, అత్తపై కేసు నమోదు

మంత్రాలయం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన ఏబేలు, ఈరమ్మల కూతురు సులోచనను భర్త, అత్తలు వేధింపులకు గురి చేస్తున్నట్లు మాధవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. మాధవరం గ్రామానికి చెందిన సులోచనను గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన మార్తమ్మ కుమారుడు రవికి ఇచ్చి 9 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. అత్త, భర్త నిత్యం వేధిస్తున్నారనీ పుట్టినిల్లు అయిన మాధవరం వచ్చింది. తల్లిదండ్రులతో కలిసి శుక్రవారం మాధవరం పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో బాధితురాలి పిర్యాదు మేరకు భర్త రవి, అత్త మార్తమ్మలపై వేదింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్పొరేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీ అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి

ఎమ్మిగనూరు టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రైవేట్, కార్పొరే ట్ పాఠశాలలో ఫీజుల దోపిడిని ఆరికట్టాలని పీడీఎస్‌యూ తాలుకా కార్యదర్శి తిమోతి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి అనీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో తిమోతి, అనీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన ప్రతిసారి వారి ఉనికి కొసం విద్యారంగంలో సంస్కరణల పేరిట ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీలో పిల్లలను చేర్పించాలంటే కనీసం రూ.10వేలు వరకు ఫీజు వసూలు చేస్తున్నారన్నారు.విద్యను వ్యాపారంగా మారుస్తూ చదువును మధ్య తరగతి కుటుంబాలకు దూరం చేస్తున్నారన్నారు. దోపిడీని ఆరికట్టాల్సిన విద్యాశాఖ అధికారులు మామూల్ల మత్తులో మునిగి తెలుతున్నారన్నారు.అక్రమ ఫీజులను ప్రభుత్వ అధికారులు ఆరికట్టాలని లేని పక్షంలో పీడీఎస్‌యూ అధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నరసింహ, వెంకట్, ఆది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ

ఎమ్మిగనూరు, మే23(ఆంధ్రజ్యోతి): ఈనెల 23లోపు ఇళ్లనిర్మాణాలు పూర్తి చేసేందుకు గృహనిర్మాణాధికారులు చర్యలు తీసుకోవాలని అర్బన్ నోడల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ వైపీ రమణారెడ్డి సూచించారు. శుక్రవారం మున్సిపాలిటిలో కమిషన్ ఛాంబర్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వేలు, వాటర్ సప్లై, శానిటేషన్, హౌసింగ్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల్లో పురోగతి ఉండలన్నారు. వర్షాకాలం వస్తుండటంతో తాగునీరు, పారిశుద్యం పై దృష్టి సారించాలన్నారు. ఆయా శాఖల అధికారుల సూచనలతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో డీఈఈలు నీరజ, విక్టర్, రాజునాయక్, హౌసింగ్ డీఈఈ ప్రసాద్, ఏఈ మధన్, ఇన్‌చార్జీ మేనేజర్ అస్లాం, జేఏఓ సురేంద్రలు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

గోనెగండ్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఇంటి నంబర్‌కు ఆధార్ తో అనుసంధానం చేసుకోవాలని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ కోరారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయలో వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిని ఆధార్‌తో అనుసంధానం చేస్తే ఆన్‌లైన్‌లో నమోదు అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెండు రోజులుగా మండల కేంద్రమైన గోనెగండ్లలోని పలు వీధుల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కాలువల్లో నిండిన చెత్తను, ముళ్ల పొదలను ట్రాక్టర్, జేసీబీ లతో తొలగిస్తున్నామన్నారు. అంటు వ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్‌బాషా, అనిల్, సుభాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లోనే సరుకులు తీసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, మే23(ఆంధ్రజ్యోతి): జూన్ నుంచి రేషన్ సరుకులను రేషన్ దుకాణాల్లోనే తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిపే ఎండీయూ (రేషన్ సరఫరా చేసే) వాహనాలను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ దుకాణాలు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు రేషన్ షాపుల్లో డీలర్లు సరుకులను పంపిణీ చేస్తారాని తెలిపారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులకు, వికలాంగులకు రేషన్ డీలర్లే సరుకులను ఇంటి దగ్గరకు తీసుకెళ్లి ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

● పెద్దకడుబూరు:
వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులు తీసుకోవాలని తహసీల్దార్ గీతా ప్రియదర్శిని తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ డీలర్లు దుకాణాలు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అలాగే సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు రేషన్ షాపుల్లో సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు. అలాగే 65 ఏళ్లు నిండిన వృద్దులకు, వికలాంగులకు రేషన్ డీలర్లే సరుకులను ఇంటి దగ్గరకే సరఫరా చేస్తారని తెలిపారు.

● కోసిగి
రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రేషన్ పంపిణీలో ప్రభుత్వ ఖాజానాకు అధిక మొత్తంలో వృధాగా ఖర్చు అవుతుండటంతో ఎండీయూ వాహనాలను ప్రభుత్వం రద్దు చేసిందని జూన్ 1 నుంచి రేషన్ షాపుల్లోనే డీలర్లు పండుగ వాతావరణంలో రేషన్ నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ రుద్రగౌడు తెలిపారు.

యోగాంధ్రను నిర్లక్ష్యం చేయొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎస్.రవి

మంత్రాలయం, మే 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యోగాంధ్ర పై గ్రామాల్లో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని, ఏ అధికారి కూడా నిర్లక్ష్యం వహించవద్దని మండల స్పెషల్ ఆఫీసర్ నారాయణమూర్తి, తహసీల్దార్ ఎస్.రవి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నూర్జహాన్ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులతో యోగాంధ్రపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 18న మండల స్థాయి యోగా నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ కార్యదర్శులను భాగస్వాములు చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య, ఎంఈవో రాగన్న, గ్రామ కార్యదర్శులు వేణుగోపాల్, హిజ్రత్ బాషా, లక్ష్మిదేవి, స్వామినాథన్, వీరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు సమయం ఇవ్వాలి: డీటీఎఫ్


సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ నాయకుడు

ఎమ్మిగనూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌కు తక్కువ సమయం కేటాయించటంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీజీ వెంకటరాముడు, గట్టుతిమ్మప్ప అన్నారు. శుక్రవారం పట్టణంలోని డీటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర నాయకులు గోట్ల చంద్రశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలకు సమయం లేకపోవటంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఎస్‌జీటీ ఉద్యోగం పొంది తదుపరి డీఎస్సీలో నేరుగా స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులు బదిలీలకు ధరఖాస్తు చేస్తే కేవలం స్కూల్ అసిస్టెంట్ సర్వీసుకు మాత్రమే పాయింట్లు కేటాయిస్తున్నారన్నారు.. ఉపాధ్యాయులు ఒత్తిడికి గురికాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని బదిలీలు పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరారు. సమావేశంలో డీటీఎఫ్ నాయకులు ఈశ్వరరెడ్డి, సోమేశ్వర రెడ్డి, వెంకటేశప్ప, జగదీష్, మజహర్ బాషా, బందేనవాజ్, గంగాధర్‌లు పాల్గొన్నారు.

నిత్య పూజలకు విరామం

● ఏకాదశి పూజలు బంద్


అలంకరణ లేని రాఘవేంద్రస్వామి బృందావనం

మంత్రాలయం, మే 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి సన్నిధానంలో శుక్రవారం ఏకాదశి సందర్భంగా నిత్య పూజలకు విరామం కల్పించారు. వైశాఖ ఏకాదశి పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మూలరాములకు సంస్థాన పూజ చేశారు. రాఘవ రాయుడి బృంధావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, తులసి అర్చన చేసి హారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారి నిజ బృంధావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. టెంకాయ కొట్టడం, పరిమళ ప్రసాదం, రథోత్సవాలు, నిత్యాన్నదానం బంద్ చేశారు. మఠం పీఠాధిపతి పండితులు, ఉద్యోగులు ఉపవాసాన్ని పాటించారు

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


మాట్లాడుతున్న వాల్మీకి ఉద్యోగ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

ఎమ్మిగనూరు టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా జిల్లా పరిషత్, ప్రభుత్వ మరియు మున్సిపల్ పాఠశాలలో గత సంవత్సరం పదవ తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులకు మే 25న పట్టణంలో పోస్ట్ ఆఫీసు ఎదురుగా ఉన్న మహర్షి వాల్మీకి కమ్యూనిటి హాల్‌లో శ్రీవాల్మీకి మహర్షి ప్రతిభా పురస్కారాలను అందజేస్తామని వాల్మీకి ఉద్యోగ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉసేని, వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభ పురస్కారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నరసింహులు, శేఖర్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

ఎమ్మిగనూరు రూరల్, మే23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురం గ్రామంలో గడ్డివామి దగ్ధమైన సంఘటన శుక్రవారం జరిగింది గ్రామానికి చెందిన మేకల నరసింహులు పశువుల కోసం గడ్డిని వామిగా పేర్చుకున్నాడు. అయితే ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో దగ్ధమైంది. దీన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయడంతో హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

17వ రోజుకు చేరిన సమ్మె

ఎమ్మిగనూరు టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు మరియు న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 17వ రోజు సమ్మె కొనసాగించారు. మున్సిపల్ కార్యాలయం నుండి సోమప్ప సర్కిల్ నుంచి వైఎస్‌ఆర్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట కూర్చోని తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్ర నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్ పాల్గొన్నారు.

రైతులు ఔషధ మొక్కలు సాగు చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): రైతులు ఔషధ మొక్కల పెంపకాన్ని సాగుచేయాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త తెలిపారు. శుక్రవారం విజయవాడలోని మెడిషనల్ ప్లాంట్‌బోర్డు కార్యాలయంలో జరిగిన ఔషద మొక్కల పెంపక అవగాహన కార్యక్రమానికి బనవాసి విజ్ఞాన కేంద్రం నుంచి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరితో పాటు, రైతులు హాజరై రైతులకు ఔషధ మొక్కల పంటలను సాగుచేస్తే వచ్చే ఆదాయాల గురించి వివరించారు. అలాగే ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడి లను రైతులకు వివరించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ

గోనెగండ్ల, మే 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లకు త్వరలో తాగునీటి సమస్య తీరుతుందని, ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం గోనెగండ్లలో జలజీవన్ మిషన్ నిధుల కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. శివాలయం దగ్గర నిర్మించిన ట్యాంక్ నుంచి గ్రామానికి పైప్ లైన్ ఏర్పాటు చేసే పనులను వారు పరిశీలించి సిబ్బందికి జాగ్రత్తలను సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యా సాగర్, ఏఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గోనెగండ్ల జలజీవన్ మిషన్ కింద రూ. 2.50 కోట్లు నిధులు విడుదల అయ్యాయని వాటితో పనులు జరుగుతున్నాయ తెలిపారు. గ్రామంలో నీటి ట్యాంక్‌లను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి పైప్‌లైన్ ద్వార నీటిని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్, అడ్వకేట్ చంద్రశేఖర్, మలాంగ్, సుభాన్ పాల్గొన్నారు.

'టౌన్ బ్యాంకుకు ఎన్నికలు నిర్వహించాలి'


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు, మే 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకుకు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మన్, వైసీపీ నాయకులు యుకే రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేశప్ప, వైస్‌ఛైర్మన్ నజీర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బ్యాంకుకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర సహకార కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్, జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు సహకార శాఖల అధికారులకు వినతిపత్రాలు పంపారు. సమావేశంలో నాయకులు శివప్రసాద్, విరుపాక్షి రెడ్డి, పాలశ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

వాహనదారుల అవస్థలు


శ్రీనివాస సర్కిల్‌లో రహదారికి అడ్డంగా నిలుచున్న ఆవులు

ఎమ్మిగనూరు టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు పుర వీధుల్లో ఆవులు, వీధిపశువులు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఉంటూ పాదాచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయని స్థానికులు తెలిపారు. వీధి పశువులను, ఆవులను గోశాలలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొని దాదాపు నెలలు గడుస్తున్న తరలించిన ధాఖలాలు లేవు. మునిపల్ అధికారులు మాటలకే పరిమితం అయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధి పశువులు, ఆవులు ప్రధాన రహదారులను ఆవాసం చేసుకుంటూ సంతమార్కెటు, వైఎస్‌ఆర్ సర్కిల్, సోమప్ప సర్కిల్, శ్రీనివాస సర్కిల్, తేరుబజారులో రోడ్డుకు అడ్డంగా ఉండడంతో వాహనాదారులు పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోక్కసారి ప్రమాదకర సంఘటనలు జరుగుతున్నాయి. కోడె దూడలు పోట్లాడుకుంటూ అటుగా వెళ్తున్న పాదాచారులను గాయపరుస్తుండడంతో కాళ్ళు చేతులు విరిగిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా మునిపల్ అధికారులు వాటిని గోశాలలకు తరలించాలని ప్రజలు కోరుకుంటున్నారు.